


రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆదివారం) : 6.22

సహరి (సోమవారం) : 4.47

ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	38.0	25.0
కావలి	37.0	25.0
కందుకూరు	37.0	26.0
ఆత్మకూరు	41.0	24.0
ఉదయగిరి	36.0	24.0





సాంకేతిక విప్లవంలో ప్రధానమైనది సోషల్ మీడియా. అరచేతిలోని ఆండ్రాయిడ్‌తో ప్రపంచం ఓ కుగ్రామంగా మారిన నేపథ్యంలో ప్రపంచదేశాల్లో ఏం జరుగుతుందో మారుమూల గ్రామాలకు కూడా తెలిసిపోతోంది. పట్టణాల నుంచి పల్లెల వరకు ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్, టెలిగ్రాం తదితర యాప్‌లను వినియోగించే వారి సంఖ్య క్రమంగా పెరిగిపోతోంది. ఏదైనా విషయం గురించి, వ్యక్తుల గురించి తెలియచేయాలన్నా, వ్యతిరేకంగా ప్రచారం చేయాలన్నా సోషల్ మీడియానే వేదిక అవుతోంది. ఈ క్రమంలో ఇప్పుడు సార్వత్రిక ఎన్నికల్లో ప్రసారానికి రాజకీయ పార్టీలకు సోషల్ మీడియానే ఓ ప్రధాన అస్త్రంగా మారింది. అయితే, తస్మాత్ జాగ్రత్త! సోషల్ మీడియాలో ఎన్నికల ప్రసారం చేస్తే ఎన్నికల సంఘం చూస్తూ ఊరుకోదు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించింది.

సాంకేతిక సమరం!

- ప్రచారంలో హైటెక్‌దే హవా!
- పెచ్చుమీరుతున్న రాజకీయ ప్రసారాలు
- సోషల్ మీడియాపై నిఘా
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలే!

సాంకేతిక విప్లవం పెరిగిన నేపథ్యంలో ఈసారి ఎన్నికల ప్రసారంలో సోషల్‌మీడియా (సామాజిక మాధ్యమం) కీలక భూమిక పోషించనుందనే అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది. అభ్యర్థులు పబ్లిసిటీ పొందేందుకు టెక్నాలజీని ఆశ్రయిస్తున్నారు. అందుబాటులో ఉన్న సామాజిక మాధ్యమాలను సాధ్యమైనంత వరకు వాడుకుంటూ ఓటర్లను ఆకట్టుకునే పనిలో నిమగ్నమై ఉన్నారు. దాదాపు ఓటర్లలో ప్రతి ఒక్కరూ స్మార్ట్‌ఫోన్ వినియోగిస్తుండటంతో తమ రాజకీయ ప్రత్యర్థుల ఫొటోలతో మల్టీ మీడియా గ్రాఫిక్స్ తయారుచేసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తున్నారు. తమ పార్టీ అధినేతలను కథానాయకులుగా, ఇతర పార్టీల ముఖ్యనేతలను ప్రతినాయకుల పాత్రల్లో చూపుతూ షేర్‌చేసి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సోషల్ మీడియా ఏది తెరిచినా ప్రస్తుతానికి ఇవే కనిపిస్తున్నాయి.

● సెక్షన్లు ఇవీ..!

● **సెక్షన్ 123 :** జాతి, మతం, కులం, సంఘం, భాషను రెచ్చగొట్టేలా వ్యవహరించడం, ఒత్తిడి గురిచేస్తే ఈ సెక్షన్ కింద కేసు నమోదు చేస్తారు. ● **సెక్షన్ 125 :** ఎన్నికల సందర్భంగా వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని పెంపొందిస్తే మూడేళ్లపాటు జైలుశిక్ష లేదా జరిమానా ఉంటుంది. ఒక్కోసమయంలో ఈ రెండింటినీ కూడా విధించే అవకాశం ఉంది. ● **సెక్షన్ 126 :** ఎన్నికల సమయానికి 48 గంటల ముందు బహిరంగ సభలు నిర్వహిస్తే శిక్షార్హులు. దీనికి రెండేళ్ల జైలు లేదా జరిమానా విధిస్తారు. ● **సెక్షన్ 127 :** ఎన్నికల సమావేశం సందర్భంగా ఎటువంటి అల్లర్లకు పాల్పడితే నేరుగా పోలీసు అధికారులు ఆ వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేస్తారు. ఈ సెక్షన్‌కు ఆరు నెలల జైలు శిక్ష లేదా రూ.2 వేల జరిమానా విధిస్తారు. ● **సెక్షన్ 128 :** బహిరంగంగా ఓటేసినా 3 నెలల జైలు లేదా జరిమానా విధిస్తారు. ● **సెక్షన్ 129 :** అధికారులు, సిబ్బంది, పోలీసులు పోటీచేసే అభ్యర్థికి సహకరించినా, ప్రభావం కలిగించినా శిక్షార్హులు. దీనికి 3 నెలల జైలుశిక్ష లేదా జరిమానా ఉంటుంది. ● **సెక్షన్ 130 :** పోలింగ్‌స్టేషన్‌కు 100 మీటర్ల లోపల ప్రచారం చెయ్యకూడదు. ఒకవేళ చేస్తే ఈ సెక్షన్ కింద జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తారు.

● **సెక్షన్ 131 :** పోలింగ్ కేంద్రానికి సమీపంలో ప్రచారం చేస్తే ఏ పోలీసు అధికారి అయినా సరే అరెస్టు చేసి ఆ సామగ్రిని స్వాధీనం చేసుకోవచ్చు. ఈ కేసుకు 3 నెలల జైలుశిక్ష లేదా జరిమానా ఉంటుంది. ● **సెక్షన్ 132 :** ఓటేసే సమయంలో నిబంధనలు పాటించని వారికి 3 నెలల జైలు, లేదా జరిమానా విధిస్తారు. ● **సెక్షన్ 134 :** అధికార దుర్వినియోగానికి పాల్పడితే జైలుశిక్ష లేదా జరిమానా ఉంటుంది. ● **సెక్షన్ 134(బీ) :** పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలకు మారణాయుధాలతో వెళ్లడం నిషిద్ధం. అలా వెళ్లిన వారికి 2 నెలలు జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. ● **సెక్షన్ 135 :** పోలింగ్ కేంద్రం నుంచి బ్యాలెట్ పత్రం, ఈవీఎం అపహరిస్తే శిక్షార్హులు. ఈ కేసుకు ఏడాది జైలుశిక్ష, జరిమానా ఉంటుంది. ● **సెక్షన్ 135(బీ) :** ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నికల రోజు వేతన సెలవుగా మంజూరు చేసినా కేసు నమోదు చేస్తారు. ఈ కేసుకు కూడా జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. ● **సెక్షన్ 134(ఏ) :** ప్రభుత్వ ఉద్యోగి ఎన్నికల ఏజెంటు, పోలింగ్ ఏజెంటు, ఓట్ల లెక్కింపు సమయంలో ఏజెంటుగా వ్యవహరిస్తే శిక్షార్హులు. దీనికి 3 నెలలు జైలు, జరిమానా ఉంటుంది. ● **సెక్షన్ 49(పి) :** ఒక వ్యక్తి ఓటు మరోవ్యక్తి వేస్తే పోలింగ్ ఆఫీసర్‌కు సదరు ఓటర్ 49(పి) సెక్షన్ ప్రకారం తన ఆధారాలు చూపించాలి. ప్రిసైడింగ్ అధికారి సదరు ఓటర్‌కు ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. చూపించలేకపోతే కేసు నమోదు చేసి జైలుకు పంపుతారు.

● ఇష్టానుసారం పోస్టింగ్‌లు కుదరవు

సామాన్యులతోపాటు ఉద్యోగులు సైతం ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లలో పోస్టులు పెడుతుంటారు. అయితే ప్రస్తుతం ఎన్నికల కోడ్ రావడంతో వీటిపై ఎన్నికల సంఘం ప్రత్యేక నిఘా ఉంచింది. ఏ పార్టీ అభ్యర్థి కోసం ప్రచారం చేసినా చర్యలు తప్పవని స్పష్టం చేసింది. జిల్లాలో ఉన్న పలుశాఖల అధికారులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు వివిధ పార్టీలకు పరోక్షంగా సహకరించినా, ప్రయత్నించినా ప్రత్యర్థి పార్టీల వ్యక్తులకు సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు, వీడియోలు పెట్టినా ఇక అంతే సంగతులు. పోస్టింగులు ఊస్టింగ్ అవుతాయి. పోలింగ్ ముగిసి ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకు ఉద్యోగులు అప్రమత్తంగా ఉండకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవలసి వస్తుందని ఎన్నికల సంఘం అధికారులు హెచ్చరిస్తున్నారు.

– నెల్లూరు (విద్య)

'కోడ్' ఎఫెక్ట్!

సచివాలయ ఉద్యోగులతో పెన్షన్ల పంపిణీ?

నెల్లూరు (హరనాథపురం) : సంక్షేమ పథకాల అమలులో అన్నీ తామై వ్యవహరిస్తున్న వలంటీర్ల కార్యకలాపాలకు బ్రేక్ పడింది. సామాజిక పెన్షన్ల పంపిణీ చేస్తున్న వలంటీర్ల విధులపై కేంద్ర ఎన్నికల సంఘం ఆంక్షలు విధించింది. వలంటీర్లతో డబ్బు పంపిణీ చేయించొద్దని, అలాగే కోడ్ పూర్తయ్యే వరకు వలంటీర్లకు ఇచ్చిన ఫోన్లు, ఇతర పరికరాలు స్వాధీనం చేసుకోవాలని ఆదేశించింది. సంక్షేమ పథకాల అమలుకు ప్రత్యామ్నాయం చూసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. సచివాలయాల్లో రెగ్యులర్ సిబ్బంది ద్వారా పెన్షన్లు పంపిణీ చేయించే ఏర్పాట్లు చేయిస్తున్నట్లు తెలిసింది.

● పీఆర్ ఏఈపై కేసు నమోదు

కలువాయి : ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన పీఆర్ ఏఈ సాంబశివారెడ్డిపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. నూకనపల్లి పంచాయతీలో సిమెంటు రోడ్డు వేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో, ఎంసీసీ నోడల్ అధికారి పభాకర్ ఫిర్యాదు మేరకు పీఆర్ ఏఈపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అయ్యప్ప తెలిపారు.

● ప్రభుత్వ టీచరు సస్పెన్షన్

నెల్లూరు : ఎన్నికల నియమావళిని అతిక్రమించి వైసీపీ సభలో పాల్గొన్నట్లు అందిన ఫిర్యాదు మేరకు ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ ప్రకాశం డీఈవో సుభద్ర శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉలవపాడు మండలం కరేడు గ్రామానికి చెందిన కేశవరపు జాలిరెడ్డి ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం బింగిపల్లి ఎంపీపీ స్కూల్లో సెకండ్ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 2న కందుకూరు వైసీపీ అభ్యర్థి బుర్రా మధసూదన్ యాదవ్ కరేడులో నిర్వహించిన సభలో ఆ టీచరు పాల్గొన్నట్లు ఆధారాలతో సహా వీఎస్‌రెడ్డి పేరుతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు అందింది. దీనిపై విచారించిన అధికారులు నివేదిక అందజేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అయితే, 6న కరేడు ర్యాంపు వద్ద వైసీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డికి స్వాగతం పలికే కార్యక్రమంలో బహిరంగంగా పాల్గొన్నాడని జాలిరెడ్డికి సంబంధించిన వీడియో ఆధారాలు మరోసారి ఎన్నికల కమిషన్‌కు పంపించారు. విచారణలో వాస్తవమని తేలడంతో జాలిరెడ్డిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకాశం డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. అంతేగాక సస్పెన్షన్ సమయంలో జిల్లా పరిధి దాటి వెళ్లకూడదని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.


● ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

మర్రిపాడు : ఎన్నికల కోడ్‌ను ఖాతరు చేయని ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఫారుక్ అలీపై మర్రిపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఉదయగిరి మండలం కృష్ణంపల్లి హైస్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్న ఆయన ఈ నెల 23న కృష్ణాపురంలో మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డితో కలిసి రచ్చ బండ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురిత మవడంతో జిల్లా కలెక్టరు స్పందించారు. ఉదయగిరి ఎంఈవో విచారించి, నివేదిక ఇవ్వగా మర్రిపాడు ఎంపీడీవో మనోహర్‌రాజ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.

గౌరవప్రదంగా వ్యాపారాలు చేసుకోండి

నెల్లూరు (హరనాథపురం) : ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ గౌరవప్రదంగా వ్యాపారాలు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ యాలమూరి రంగయ్య నాయుడు కోరారు. శనివారం నెల్లూరులోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూపన్లతో ఎటువంటి లావా దేవీలు నడపొద్దని అన్నారు. మరోవైపు ధాన్యం కొనుగోలు చేసినప్పుడు ఓచర్ పద్ధతిలో చెల్లింపులు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆంధ్ర ప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ సమన్వయ కర్త ఏపీఎస్ కృష్ణమోహన్ మాట్లా డుతూ నిజాయతీగా, నిబంధనల ప్రకారం వ్యాపారం చేసే వారికి ఏమైనా ఇబ్బందుల కలిగితే 9849576708 నెంబరుకు ఫోన్ చేయాలని కోరా రు. సమా వేశంలో ఈసీ మెంబర్లు రమేష్‌బాబు, బలరామయ్య నాయుడు పాల్గొన్నారు.

నేడు ఈస్టర్



నెల్లూరు(సాంస్కృతికం) : ఏసుక్రీస్తు పునరుత్థానంను క్రైస్తవులు ఈస్టర్ పండుగగా జరుపుకుంటారు. గుడ్‌ఫ్రైడే శుక్రవారం కల్వరిలో ఏసుక్రీస్తును ప్రజల పాపాల నుంచి విముక్తి కలిగించడం కోసం శిలువ మరణం పొందుతారు. ఆయన సమాధి చేయబడిన ఏసుక్రీస్తు 3వ రోజు సమాధి నుంచి లేచి దైవదూతగా పునరుత్థానం చెందుతారు. ఏసుక్రీస్తు లేచినందుకు ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ పండుగను జరుపుకుంటారు. ఈస్టర్ సందర్భంగా క్రైస్తవులందరూ చర్చిలకు వెళ్లి ప్రార్థనలు చేస్తారు. తమ పూర్వీకుల సమాధులను శుభ్రం చేసి అందంగా అలంకరించి తమ పెద్దలను క్షమించి తనతోపాటు స్వర్గానికి తీసుకుని పొమ్మని పునరుత్థానుడైన యేసును చిత్తశుద్ధితో ప్రార్థనలు చేస్తారు.

వామ్మో.. ఏం ఎండ!



నెల్లూరు (సిటీ), మార్చి 30 : భానుడు భగ్గుమన్నాడు. వీధుల్లో నిప్పులు చెరిగాడు. ఈ ఏడాది తొలిసారిగా శనివారం ఉష్ణోగ్రత 41 డిగ్రీలకు చేరుకుంది. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణుల హెచ్చరికలు జారీ చేశారు. సాధ్యమైనంత వరకు పగటిపూట ఇళ్లలో నుంచి బయటకు రావొద్దని వారు సూచించారు. కాగా, శనివారం కలువాయి, అనంతసాగరం, ఆత్మకూరు మండలాల్లో 41 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదవగా, అత్యల్పంగా ఏఎస్‌పేటలో 28.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

అందరినీ కలుపుకొని వెళ్లండి..

భారీ మెజారిటీతో గెలవాలి!

- అభ్యర్థులకు టీడీపీ అధినేత చంద్రబాబు దిశానిర్దేశం



సమావేశం అనంతరం చంద్రబాబుతో కలిసి వెలుపలకు వస్తున్న అభ్యర్థులు వేమిరెడ్డి, కాకర్ల, కావ్య

నెల్లూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : 'పాత, కొత్త నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకోవాలి. ఈ బాధ్యత పూర్తిగా అభ్యర్థులదే. ప్రచారంలో విస్తృతంగా పాల్గొని అన్ని స్థానాల్లో భారీ మెజారిటీతో గెలవాలి.'అంటూ తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అభ్యర్థులకు సూచించారు. శనివారం ఉదయం వింజమూరులో నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కావలి, ఉదయగిరి, కందుకూరు అభ్యర్థులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్‌లతో చంద్రబాబు భేటీ అయ్యారు. నియోజకవర్గాల వారీగా పార్టీ బలాలు, బలహీనతలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని నాయకులను కలుపుకొని వెళ్లే బాధ్యత అభ్యర్థులదేనని చంద్రబాబు స్పష్టం చేశారు. 'మీరు ఏం చేస్తారో నాకు తెలియదు. నియోజకవర్గంలో పార్టీ నాయకులంతా ఒకేతాటిపైకి రావాలి. ప్రచారంలో విస్తృతంగా పాల్గొనాలి. మీ గెలుపు బాధ్యతను వారు భుజాన వేసుకోవాలి. అలా వారిని సమన్వయపరుచుకునే బాధ్యత మీదే.' నంటూ చంద్రబాబు అభ్యర్థులను ఆదేశించినట్లు తెలిసింది. అలాగే వైసీపీ నుంచి పెద్ద ఎత్తున వలస వచ్చి, టీడీపీలో చేరుతున్నట్లు చెప్పారు. కొత్తవారిని, పాతవారిని సమన్వయపరుచుకొని పని చేయడంలోనే అభ్యర్థుల సక్సెస్ ఆధారపడి ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం గాలి వీస్తోందని, అభ్యర్థులు, నాయకులు సమైక్యంగా కృషి చేస్తే భారీ మెజారిటీతో గెలవడం ఖాయమన్నారు. పోలింగ్ రోజు వరకు ఒక్క నిమిషం కూడా విశ్రమించకుండా కృషి చేయాలని, కేడర్‌ను నడిపించాలని పార్టీ నాయకులకు చంద్రబాబు సూచించారు. కావలి, వింజమూరు ప్రజాగళం సభలు విజయవంతానికి కృషి చేసిన నాయకులను అభినందించారు. కాగా, జలదంకి మండలానికి చెందిన పలువురు చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. అనంతరం ఉదయం 11 గంటల ప్రాంతంలో చంద్రబాబు హెలికాప్టర్‌లో ప్రొద్దుటూరు బయలుదేరి వెళ్లారు.



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన జలదంకి ఎంపీపీ వెంకట రమణయ్య

● టీడీపీలో భారీగా చేరికలు

జలదంకి : వైసీపీకి కంచుకోట అయిన జలదంకి మండలంలో ఆ పార్టీకి బీటలు వారాయి. ప్రజాగళం పేరుతో వింజమూరుకు వచ్చిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు సమక్షంలో ఎంపిపి గోచిపాతల వెంకటరమణయ్యతో పాటు నలుగురు ఎమ్పీటీసీ సభ్యులు, కో-ఆప్షన్‌సభ్యుడు జలదంకి సొసైటీ డైరెక్టర్ గొట్టిపాటి ప్రసాద్‌నాయుడు, జలదంకి, బ్రాహ్మణక్రాక ఉపసర్పంచ్‌లు కూరపాటి మాలకొండారెడ్డి, దగుమాటి మాల్యాద్రిరెడ్డి, పలు పంచాయతీలకు చెందిన వార్డు సభ్యులు చేరారు. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, వైసీపీ నేత చేవూరి జనార్దన్ రెడ్డిల టీడీపీలో చేరడంతో అధికార పార్టీకి గట్టిదెబ్బ తగిలింది.

వైసీపీలోకి ఏఎస్ పేట దర్గా సజ్జదా



వైసీపీ ఎంపీ అభ్యర్థితో హాఫీజ్ పాషా

ఏఎస్‌పేట : ప్రభుత్వ వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలోని దర్గా సజ్జదాగా ఉన్న హాఫీజ్ పాషా తన కుటుంబసభ్యులతో కలిసి శనివారం వైసీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి సమక్షంలో వైసీపీలో చేరడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా దర్గా సజ్జదా హాఫీజ్ పాషా, ఉప సజ్జదాగా చెప్పుకునే ఆయన తనయుడు జేనేద్ పాషా వైసీపీలో చేరారు. దీనిపై ఎన్నికల అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

మంత్రి కాకాణి ప్రచారంలో ఎండీయూ ఆపరేటర్లు



మంత్రి కాకాణి పక్కనే ఎండీయూ ఆపరేటర్లు (వృత్తంలో ఉన్నవారు)

మనుబోలు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలోనే ఎన్నికల ప్రచారంలో ఎండీయూ ఆపరేటర్లు జట్లకొండూరుకు చెందిన ఆవుల తులసీరామ్ యాదవ్, గోవిందరాజపురానికి చెందిన గుంజి రమేష్ పాల్గొన్నారు. దీనిపై తహసీల్దార్ చిరంజీవి మాట్లాడుతూ ఆ ఇద్దరు ఆపరేటర్లు రాజీనామా చేశారని, అయితే, వాటిని ఇంకా కలెక్టర్ ఆమోదించలేదన్నారు. ఆమోదం కాకుం డా ప్రచారాల్లో పాల్గొంటే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే దీనిపై ఫిర్యాదు లు అందాయని, ఎఫ్ఎసీ టీమ్ వెళ్ళిందని బదులిచ్చారు.

సార్వత్రిక ఎన్నికల క్రతువు మొదలైనప్పటి నుంచి నెల్లూరులోని కాంట్రాక్టర్ల పంట పండింది. అలా బిల్లు అప్‌లోడ్ చేయగానే ఇలా సొమ్ములు వారి బ్యాంకు ఖాతాలో జమైపోతున్నాయి. కాంట్రాక్టర్లంతా వైసీపీ నాయకులే కావడంతో చకచక బిల్లులను ఇంజనీరింగ్ అధికారులు పూర్తి చేసి సీఎఫ్ఎంఎస్‌కు పంపేస్తున్నారు. కార్పొరేషన్‌లోని ఖజానాకు బిల్లులు హోరెత్తుతుండగా, కార్యాలయంలో కాంట్రాక్టర్లు క్యూ కట్టిమరీ తమ బిల్లులను అప్‌లోడ్ చేయించుకుంటున్నారు. కాంట్రాక్టర్ల కోసంగానే ప్రభుత్వం నుంచి అదనంగా రూ. 20 కోట్లు మంజూరు చేయడం గమనార్హం. గడప గడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ) పనులు మినహా మిగతావన్నీ మంజూరైనట్లు తెలుస్తోంది.

- 'కార్పొరేషన్' ఖజానాకు బిల్లుల హోరు
- కార్యాలయంలో బారులు తీరుతున్న కాంట్రాక్టర్లు
- ఎన్నికల వేళ హడావిడిగా మంజూరు
- అదనంగా రూ.20 కోట్ల కేటాయింపు, చెల్లింపు
- జీజీఎంపీ బిల్లుల మంజూరుకూ ఆదేశాలు?

ఉన్నదంతా ఊడ్చేద్దాం!

నెల్లూరు (సిటీ), మార్చి 30 : నెల్లూరులోని మున్సిపల్ డివిజన్లలో వైసీపీ నాయకులు, కార్పొరేటర్లు కాంట్రాక్టర్లుగా ఉన్నారు. ప్రస్తుతం సార్వత్రిక పోరు జరుగుతుండటంతో వారిని ఆర్థిక పరిపుష్టులను చేసేందుకు పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నిటినీ మంజూరు చేసేస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాలలో ఇటీవల అభివృద్ధి పనుల పేరిట సీసీరోడ్లు, కల్వర్టులు, రోడ్లు ఆధునీకరణ, డ్రైనేజీ కాలువ నిర్మాణాలు జోరుగా నిర్వహించారు. అవసరమున్నా, లేకున్నా కాంట్రా క్టర్ల ప్రయోజనాల కోసం చకచక నిర్మాణాలు చేపట్టారు. ఈ బిల్లు లన్నీ ఇంజనీరింగ్ అధికారులు అదే వేగంతో అప్‌లోడ్ చేసి సీఎఫ్ఎంఎస్‌కు పంపారు. కార్పొరేషన్ ఖజా నాలో నిల్వతో సంబంధం లేకుండా ప్రభుత్వం నుంచి రూ.20 కోట్ల వరకు కేటాయింపులు చేసు కుని పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ జమ చేశారు. ఈ బాధ్యతను అధికార పార్టీకి చెందిన ఓ ముఖ్య నేత తన భుజాలపై వేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.



● జీజీఎంపీ పెండింగ్

గడప గడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ) పేరిట ఒక్కో సచివాలయానికి మూడు విడతల్లో రూ.60 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. 166 సచివాలయాలు ఉండగా సుమారు రూ.40 కోట్ల వరకు పెండింగ్ ఉన్నట్టు సమాచారం. వీటిని కూడా స్థానికంగా ఉండే వైసీపీ నాయకులే కాంట్రాక్టర్ల అవతారమెత్తి తమ అనుకూల ప్రాంతాలలో పనులు చేపట్టారు. ప్రస్తుతం సీఎఫ్ఎంఎస్‌లో ఇవీ పెండింగ్ ఉన్నట్టు తేలడంతో వెంటనే వాటిని మంజూరు చేయించాలని వైసీపీ అభ్యర్థులపై ఒత్తిడి పెరగడంతో వాటినీ రేపోమాపో విడుదల చేసేందుకు యంత్రాంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు వైసీపీ అధిష్ఠానం నుంచి కార్పొరేషన్‌కు సమాచారం అందినట్లు ప్రచారం జరుగుతోంది.

● నాణ్యత మాకెందుకు?

చేసిన పనికి చేసినట్టు బిల్లులు మంజూరవుతుండటం, ఎన్నికల సమయంలో అందరి దృష్టి ఓట్లు రాబట్టుకోవడంలో ఉండటం, నిఘా వ్యవస్థలన్నీ ఎలక్షన్ మూడ్‌లోకి వెళ్లిపోవడంతో కాంట్రాక్టర్లు తమ చేతివాటానికి పదును పెట్టారు. చకచక పనులు చేసేస్తే సొమ్ము చేతికందుతుందని భావిస్తున్న అనేక మంది కాంట్రాక్టర్లు నిర్మాణాల్లో నాణ్యతకు తిలోదకాలిస్తున్నారు. 12వ డివిజన్‌లో ఓ కాంట్రాక్టరు సీసీ రోడ్డు నిర్మించగా అందులో నాణ్యతలే దంటూ అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేసినట్లు సమాచారం. మరో కాంట్రాక్టరు డ్రైనేజీ కాలువ నిర్మించగా దానికి ఆనుకుని ఉన్న రైతుల కాలువ నుంచి బయటకు వచ్చే వ్యర్థాల ముఖద్వారాన్ని మూతేయగా కాలువ నిండా నీరు నిల్వఉండటంతో అయినా బిల్లుల మంజూరుకు సిద్ధమ య్యారు. నెల్లూరురూరల్లోని మరో డివిజన్‌లో ఏకంగా క్వాలిటీని పరిశీలించే వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను పనుల వద్ద లేకుండా ఇంజనీరింగ్ అధికారులు ఆదేశించడం గమనార్హం.

నేడు సెలవు అయినా పని చేయనున్న బ్యాంకులు

నెల్లూరు (హరనాథపురం) : ఆదివారం సెలవు రోజు కూడా బ్యాంకులు పని చేయనున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా చాలా మంది ఆదాయ పన్నులు, ఇతర ఆర్థిక కార్యకలాపాలను పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తుంటారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే కావటంతో బ్యాంకులకు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు వచ్చింది. ఆర్థిక కార్యకలాపాలను దృష్టిలో ఉంచుకొని ఆదివారం కూడా బ్యాంకులలో రోజువారీ కార్యకలాపాలు నడవనున్నాయి. అలాగే ఎల్ఐసీ కార్యాలయాలు కూడా ఆదివారం తెరిచే ఉంటాయి.

హామీల అమలులో నిమ్మకు నీరెత్తారు!

- నిమ్మ ఆధారిత పరిశ్రమలు ఏవి!?
- ఐదేళ్లయినా కానరాని శీతల గోదాములు
- నెరవేరని పాలకుల హామీలు
- అభివృద్ధికి నోచుకోని నిమ్మ మార్కెట్ యార్డ్

పొదలకూరు, మార్చి 30 : అధికారంలోకి రాగానే నిమ్మ రైతును ఆదుకుంటామన్న వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మాటలు నీటిమూటలుగా మిగిలిపోయాయి. మార్కెట్ యార్డు అభివృద్ధికి నోచుకోక, శీతల గోదాములు ఏర్పాటు చేయకపోవడంతో దళారుల దోపిడీకి గురికావాల్సి వస్తోందని నిమ్మ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొదలకూరులోని నిమ్మ మార్కెట్ యార్డుకు పొదలకూరు, రాపూరు, కలువాయి, చేజర్ల, మనుబోలు, సైదాపురం, సంగం, నెల్లూరు రూరల్, వెంకటాచలం, తదితర మండలాల నుంచి రైతులు కాయలను తీసుకువస్తుంటారు. అయితే, ప్రస్తుత పరిస్థితులకు తగినట్టుగా నిమ్మ మార్కెట్ యార్డు అభివృద్ధి కాలేదు. ధరలు లేని సమయంలో దాచుకునేందుకు శీతల గిడ్డంగులు లేవు. దీంతో దశాబ్దాలుగా అన్నదాతల కష్టాన్ని వ్యాపారులు సొమ్ము చేసుకోవడం పరిపాటిగా మారింది.



దుకాణం లేక రోడ్డుపైనే గ్రేడింగ్ చేస్తున్న వ్యాపారులు

● యార్డుకు 13 ఎకరాల స్థలం

పొదలకూరు ప్రభుత్వ మార్కెట్ యార్డుకు 2008 జూన్ 20వ తేదీన 13 ఎకరాల స్థలాన్ని కేటాయించి దుకాణాలకు వేలం పాటలు నిర్వహించారు. అప్పట్లో రోడ్లపై వ్యాపారాలు చేసుకునే వ్యాపారులు యార్డు కు కష్టంగా వచ్చారు. ఇప్పుడు యార్డు అతిపెద్దగా రూపుదాల్చి నిత్యం సుమారు 200 మందికి ఉపాధి కల్పిస్తోంది. వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని ఈ యార్డును కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేసి వ్యాపారులకు దుకాణాలు ఇచ్చి, అభివృద్ధి చేసినా, అధికార వైసీపీ ప్రభుత్వం మాత్రం వసతుల కల్పనతోపాటు తమ సమస్యలను పరిష్కరించడంలో వైఫల్యం చెందినట్లు వ్యాపారులు, రైతులు ఆరోపిస్తున్నారు.

● 40 వేల ఎకరాల్లో సాగు

రెండు దశాబ్దాల కాలంలో మార్కెట్ బాగా విస్తరించింది. ఉమ్మడి నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో 40వేల ఎకరా ల్లో నిమ్మ సాగవుతోంది. ఐదేళ్లలో మొక్కలు కాపునకు వస్తాయి. ఎకరాకు 5 నుంచి 8 టన్నుల వరకు దిగు బడి వస్తుంది. ఈ ఏడాది సీజన్‌లో సగ టున కిలో రూ.50 నుంచి 70వరకు ధర పలుకుతోంది. జనవరి నెలాఖరు నుంచి మే నెల వరకు నిమ్మకాయలకు సీజన్‌గా పరిగణి స్తారు. ఈ సీజన్‌లో యార్డు నుంచి నిత్యం 15 లారీల కాయలు ఎగుమతి అవుతాయి. వాటి విలువ సుమారు రూ.50లక్షల వరకు ఉంటుంది. ఢిల్లీ మార్కెట్ యార్డులోని వ్యాపారులు తరచూ ఇక్కడకు వచ్చి వ్యాపారులతో లావాదేవీలు కుదు ర్చుకుని వెళుతుంటారు. దీంతో ఇక్కడి నుంచి ఢిల్లీ మార్కెట్‌కు కాయలు అధికంగా ఎగుమతి అవుతుంటాయి.



ఎగుమతికి సిద్ధంగా ఉన్న నిమ్మ బస్తాలు

నిమ్మ ఆధారిత పరిశ్రమలు ఏవి?

అన్ సీజన్‌లో ఎక్కువ దిగుబడులు వచ్చిన సమయంలో చాలా మంది రైతులు ధరలేక నిమ్మకాయలను రోడ్డు మీద పడేసిన సందర్భాలు కోకొల్లలు. అలాంటి సమయంలో నిమ్మ ఆధారిత పరిశ్రమలు ఉంటే ఊరగాయకి, రసాలు తీసి ఇతర వ్యాపారాలు చేయడానికి అనుకూలంగా నిమ్మ ఆధారిత పరిశ్రమలను తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ నేటికి నెరవేరలేదు. ఇప్పటికైనా పొదలకూరు చుట్టుపక్కల పరిశ్రమలను ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

- కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, రైతు సంఘం నాయకుడు

● నెరవేరని జగన్ హామీలు

వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన పాద యాత్ర, 2019 ఎన్నికల ప్రచారంలో పొదలకూరు నిమ్మ రైతులకు పలు హామీలు గుప్పించారు. దేశవ్యాప్తంగా ఉన్న ధరలను స్థానికంగా డిస్‌ప్లే చేయించి, రైతులు మోసపో కుండా చూస్తామన్న హామీ ఇప్పటికీ నెరవేరలేదు. వ్యాపా రులకు యార్డులో దుకాణాల నిర్మాణం, శీతల గిడ్డంగులు ఏర్పాటుపై పాలకులు నోరెత్తడం లేదు. నిమ్మ ఆధారిత పరి శ్రమలు తీసుకొచ్చి ఆ పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి కల్పిస్తా మన్న మాటలూ నీటిమూటలయ్యాయి.

● అర్హులకే దుకాణాలు కేటాయించాలి

యార్డు ఏర్పడిన కొత్తలో కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు 23 దుకాణాలు కేటాయించగా, టీడీపీ హయాంలో మంత్రిగా ఉన్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మరో 24 దుకాణాలు నిర్మించారు. అయితే అప్పట్లో వాటికి వేలం నిర్వహించేలోపు ఎన్నికల కోడ్ రావడంతో తాత్కాలికంగా నిలిపివేశారు. కాగా, వైసీపీ హయాంలో ఇటీవల వాటికి వేలం నిర్వహించారు. ఇది నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీకి చెందిన వారు దుకాణాలను చేజిక్కించుకున్నారని కొంతమంది కోర్టును ఆశ్రయించారు. అయితే, కోర్టు తీర్పు కంటే ముందుగానే 14 దుకాణాలకు అగ్రిమెంట్లు చేశారు. మరో 10 దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. యార్డులో ఇప్పుడు మొత్తం 40 మంది వరకు వ్యాపారులు ఉన్నారు. ఎన్నో ఏళ్లుగా నిమ్మ వ్యాపారం చేస్తూ దుకాణాలు లేని నిజమైన నిమ్మ వ్యాపారులకు పార్టీలకు అతీతంగా ఆ దుకాణాలను కేటాయించాలని వ్యాపారులు కోరుతున్నారు.



వ్యాపారులకు కేటాయించాల్సిన దుకాణాలు

● వాటర్ ట్యాంక్, టాయిలెట్లు నిర్మించాలి

యార్డులో వ్యాపారులు, రైతుల సంఖ్య పెరగడంతో మంచినీటి సమస్యలు తలెత్తుతున్నాయి. పెద్ద ట్యాంక్ నిర్మిం చాలని వ్యాపారులు కోరుతున్నారు. యార్డ్‌లో కేవలం ఒక టాయి లెట్ ఉండడం, అది కూడా నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, మరో 10 టాయిలెట్లు నిర్మించి నిర్వహణ బాగుండేలా చూడాలని వ్యాపారులు కోరుతున్నారు.

శీతల గిడ్డంగులు నిర్మించాలి



నిమ్మకాయలను నిల్వ చేసుకునేందుకు, అధిక ధరలు ఉన్న సమయంలో అమ్ముకునేందుకు వీలుగా శీతల గిడ్డంగులు నిర్మించాలి. 2019 ప్రజా సంకల్పయాత్రలో హామీలు ఇచ్చిన నాయకులు ఐదేళ్లు గడుస్తున్నా శీతల గిడ్డంగులను ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా వాటిని ఏర్పాటుచేసి అందుబాటులో ఉంచితే రైతులకు మేలు జరుగుతుంది.

- కోవూరు వెంకటేశ్వర్లు నాయుడు, చిట్టేపల్లి, నిమ్మరైతు

నిమ్మ ధరలను డిస్‌ప్లే చేయాలి



పొదలకూరు మార్కెట్‌లో దేశవ్యాప్తంగా ఉన్న ధరలను ప్రదర్శించేలా సమగ్ర చర్యలు తీసుకోవాలి. దేశంలో ఏ రాష్ట్రంలో నిమ్మ పంటకు డిమాండ్ ఉందో వ్యాపారులు, రైతులు తెలుసుకుని ఆ ప్రాంతాలకు నిమ్మకాయ ఎగుమతి చేసుకునే అవకాశం ఉంటుంది. తద్వారా రైతులు గిట్టుబాటు ధరలను పొంది మంచి లాభాలను గడించే అవకాశం ఉంటుంది. కేవలం డిస్‌ప్లే స్ర్కీన్ అమర్చి చేతులు దులుపుకోకుండా అది సమగ్రంగా పనిచేసేలా చూడాలి.

- మూలి కృష్ణారెడ్డి, నిమ్మరైతు, మొగళ్లూరు

యార్డులో వసతులు మెరుగుపరచాలి



పొదలకూరు నిమ్మ మార్కెట్‌లో సౌకర్యాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. టాయిలెట్లు, వాటర్ ట్యాంకు, రోడ్లు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నిర్మిస్తే బాగుంటుంది. అలాగే మిచాంగ్ తుఫాను దెబ్బకు వేల సంఖ్యలో నిమ్మ రైతులం నష్టపోయాం. నష్టపరిహారం అందలేదు. వెంటనే ఆ నష్టపరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- పలుకూరు మదన్‌మోహన్‌రెడ్డి, నిమ్మరైతు

మద్దతిస్తే ఇంటిని కూల్చేస్తారా!?

● జనసేన నాయకుల ఆగ్రహం



ఇంటిని కూల్చడంతో సామగ్రితో చెట్టు కింద ఉన్న కృష్ణ దంపతులు

విడవలూరు, మార్చి 30 : తెలుగు దేశం, బీజేపీ జనసేన ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రశాంతి రెడ్డిలకు మద్దతు ఇచ్చారన్న అక్కస్సుతోనే రామ చంద్రాపురానికి చెందిన పొన్నపూడి కృష్ణ ఇంటిని వైసీపీ నాయకులు శనివారం ధ్వంసం చేశారని కోవూరు నియో జకవర్గ జనసేన నాయకుడు హరికుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులను పరామ ర్శించిన ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న రామతీర్థం, రామచంద్రాపురంలలో వేమిరెడ్డి దంపతులు ప్రచారం నిర్వహించారని, ఇందులో జనసేనకు చెందిన పొన్నపూడి కృష్ణ, అనిత దంపతులు పాల్గొన్నట్లు తెలిపారు. దీనిని ఓర్వలేని వైసీపీ నాయకులు ఉద్దేశ పూర్వకంగా గతంలో ఉచితంగా ఇచ్చిన నాలుగు స్తంభాలను తిరిగి ఇవ్వాలంటూ కృష్ణ కుటుంబసభ్యులతో గొడవకు దిగి ఇంటిని పూర్తిగా నేలమట్టం చేశారని మండిపడ్డారు. వెంటనే నిందితులపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. బాధితులను పరామ ర్శించిన వారిలో జనసేన నాయకులు శివ, కృష్ణ, మున్వర్, మాధవ్, అల్తాఫ్, నాగేంద్ర, శ్రీను ఉన్నారు. కాగా, ఎస్ఐ రాజు మాట్లాడుతూ జరిగిన ఘటనపై తానే స్వయంగా బాధితులతో మాట్లాడినట్లు చెప్పారు. తమ స్తంభాలు ఇవ్వాలని బంధువులు కోరడంతో తామే ఇచ్చామని, తమ ఇంటిని ఎవరూ కూల్చలేదని బాధితులు చెప్పినట్లు వివరించారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు

● 25 మద్యం సీసాల స్వాధీనం, ఒకరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో పోలీసులు

పొదలకూరు, మార్చి 30: మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 25 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ డి రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక నిఘా పెట్టామని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఎటువంటి సమాచారం అయినా 94407 00007 నెంబరుకు ఫోన్ ద్వారా ఇవ్వాలని కోరారు. ఈ దాడుల్లో రైటర్ సుబ్బారావు, సిబ్బంది షరీఫ్, రమేష్ పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించి రూ.కోట్ల స్థలం కబ్జా

● సీ విజిల్‌కు బాధితుల ఫిర్యాదు



సీ విజిల్ ద్వారా ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 30 : జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ఓటు సెంటి మెంట్‌తో ఓ వర్గం దాదాపు రూ.కోట్లకు పైగా విలువ చేసే స్థలం కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టింది. ఈ ఘటనపై బాధితులు న్యాయం చేయాలని సీ విజిల్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నెల్లూరు నగరంలోని 31వ డివిజన్‌లో 1982లో అప్పటి కలెక్టర్ సుజాతరావు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన 30 మందికి స్వయం ఉపాధి కింద కోళ్ల ఫారాలు మంజూరు చేసింది. ఆ ప్రాంతంలో పబ్లిక్ పర్పస్ కోసం దాదాపు 200 అంకణాల స్థలం కేటాయించారు. అప్పటి నుంచి 42 ఏళ్లుగా లబ్ధిదారులు సుజాతరావు పౌల్ట్రీ కాంప్లెక్స్ షెడ్యూల్డ్ కాస్ట్ అండ్ ట్రైబల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని ఆ స్థలాన్ని కాపాడుకుంటున్నారు. దానిని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నించగా రెవెన్యూ, పోలీసులు సహకారంతో అడ్డుకున్నారు. అలాగే జిల్లా కలెక్టర్, నగరపాలక కమిషనర్, ప్రజా ప్రతినిధులు వద్దకు వెళ్లి అందులో పార్కు లేదా సచివాలయం, వైద్యశాల తదితర ప్రజలకు ఉపయోగపడే విధంగా కార్యాలయాల నిర్మాణానికి మంజూరు చేయాలని ఎన్నో వినతులు అందజేశారు. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో ఓటు సెంటిమెంటు, అధికార పార్టీ అండదండలతో రూ.కోట్లు విలువ కలిగిన స్థలంను రాత్రికి రాత్రే కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేశారు. ఈ విషయాన్ని ఆ అసో సియేషన్ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రిటర్నింగ్ అధికారి, నగర కమిషనర్, వీఆర్వో, రూరల్ తహసీల్దారు వచ్చి చూసి వెళ్లారు తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో అసోసియేషన్ నాయకులు శనివారం కబ్జా చేసి నిర్మించిన కట్టడంతో పాటు సీ విజిల్ యాప్‌లో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	145
లేయర్ లైవ్	73
స్కిన్ చికెన్	254
స్కిన్‌లెస్	284
లేయర్	125

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6502
వెండి కిలో ధర	రూ. 70,000
వెండి ఒక గ్రాము	రూ. 79.00

మాతా, శిశు మరణాలపై వివరణ ఇవ్వండి

● డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య



మాతా శిశు మరణాలపై సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు (వెంకటేశ్వర పురం), మార్చి 30: జిల్లా వ్యాప్తంగా జరిగిన మాతా, శిశు మరణాలపై పూర్తి నివేదిక ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ఆదేశించారు. శనివారం తన కార్యాలయంలో మాతా, శిశు మరణాలపై నిర్వహించిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ గత నాలుగు నెలల కాలంలో జిల్లాలో ముగ్గురు తల్లులు, 13 మంది శిశువులు మృతి చెందారని పేర్కొన్నారు. ఇందుకు కారణం ఏమిటో ఆధారాలతో సహా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇకపై ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో పలువురు వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేద పిల్లల సంజీవని బాల భవిత కేంద్రం

అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 19 ఏళ్ల వయస్సు పిల్లలకు ఎలాంటి లోపాలు ఉన్నా పైసా ఖర్చు లేకుండా వైద్యసేవలు అందించేందుకు బాల భవిత కేంద్రం సంజీవని లాంటిదని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య పేర్కొన్నారు. జిల్లా బాల భవిత కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగ ణంలోని దిశ పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న బాల భవిత కేంద్రంలో ఇప్పటి వరకు 413 మంది పుట్టుకతో లోపాలు ఉన్న పిల్లలకు వైద్యం అందించామన్నారు. నాయరల్ ట్యూబ్ లోపం, గ్రహణమొర్రి, పెదవి చీలిక తదితర సమస్యలకు ఇక్కడ వైద్యం అందిస్తా మన్నారు. పూర్తి వివరాలకు జమీర్ 9381468458 నెంబరుకు సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా క్షయ వ్యాధి నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, డాక్టర్లు సుధీర్ కుమార్, సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ మిషన్‌పై అవగాహన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌పై జిల్లాలోని ప్రైవేటు వైద్యశాలల యాజమాన్యాలు, వైద్యులకు శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో భాగంగా ప్రతి ప్రైవేటు వైద్యుడు, నరుసు, డెంటిస్టులు తప్పనిసరిగా నమోదు చేసుకుంటే ప్రత్యేక గుర్తింపు కార్డు వస్తుందన్నారు. దీనివల్ల ఈ ప్రైవేటు వైద్యశాలకు వచ్చే రోగుల పూర్తి వివరాలు అందులో పొందుపరుస్తాన్నారు. డిజిటల్ ఎకో సిస్టంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన డిజిటల్ మిషన్ ద్వారారానున్న రోజుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయం కల్పించవచ్చన్నారు. ఈ సమావేశంలో డీఎల్ఏటీవో డాక్టర్ ఖాదరవల్లి, డీపీఎంవో డాక్టర్ రమేష్, డాక్టర్ నవీన్, డాక్టర్ భాస్కర్, డీఎంవో హుస్సేన్ పాల్గొన్నారు.

అగౌరవపరిచిన ఎస్ఏకు మెమో

నెల్లూరు(హరనాథపురం), మార్చి 30 : ఆస్తుల రిజిస్ట్రేషన్ చేయించుకొనేందుకు వచ్చిన వ్యక్తి పట్ల అగౌరవంగా ప్రవర్తించిని నెల్లూరు నగరంలోని స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులుకు ఆశాఖ జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు మెమో ఇచ్చారు. వివరాల మేరకు.. నెల్లూరుకు చెందిన తిరుపతిరెడ్డి చింతారెడ్డిపాళెంలో ఓ భూమికి సంబంధించి దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు వెళ్లగా ఆ సీనియర్ అసిస్టెంటు అమర్యాదగా, అభ్యంతరకర పదజాలంతో మాట్లాడినట్లు తెలిసింది. అంతేకాక భూమి విలువ సుమారు రూ.5 కోట్లు ఉండటంతో కొంత డబ్బును అడిగినట్లు తెలిసింది. ఈ విషయాన్ని రికార్డు చేసిన తిరుపతిరెడ్డి స్టాంపులు రిజిస్ట్రేషన్లశాఖ డీఐజీ కిరణ్‌కుమార్‌కు ఆధారాలతో ఫిర్యాదు చేశారు. డీఐజీ ఆదేశాల మేరకు ఆ సీనియర్ అసిస్టెంటుకు జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు మెమో ఇచ్చి సంజాయిషీ కోరారు. ప్రజాసంబంధ కార్యాలయమైన స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అగౌరవానికి తావివ్వరాదని, ప్రజలను గౌరవంగా స్వాగతించి రిజిస్ట్రేషన్లు చేయాలని అధికారులకు సూచించినట్లు జిల్లా రిజిస్ట్రార్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన న్యాయశాఖ ఉద్యోగులు



హైకోర్టు జడ్జికి మొక్క అందజేస్తున్న న్యాయశాఖ ఉద్యోగులు

నెల్లూరు (లీగల్), మార్చి 30 : నెల్లూరు నగరానికి శనివారం వచ్చిన రాష్ట్ర హైకోర్టు జడ్జి, జిల్లా పోర్ట్ పోలియో జడ్జి జస్టిస్ ఎస్.జయ సూర్య, మరో హైకోర్టు జడ్జి జస్టిస్ సుబ్బారెడ్డి సత్తిలను జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం నాయకులు స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో కలిశారు. తమ సంఘానికి సంబంధించి పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందచేశారు. కోర్టులలో ఉన్న న్యాయశాఖ ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయాలని, అర్హులైన ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలని, ఉద్యోగ సంఘానికి భవన వసతి కల్పించాలని కోరారు. దానిపై స్పందించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య వీలైనంత త్వరగా న్యాయశాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. న్యాయమూర్తులను కలిసిన వారిలో న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేష్‌బాబు, ఈసీ. నారాయణరెడ్డి, ట్రెజరర్ కేవీ.సునీల్, నాయకులు శివకుమార్, నరసింహారావు, వెంకటేశ్వర్లు, సురేంద్రబాబు, దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

● ఆర్ఐవో శ్రీనివాసులు



తరగతులు పరిశీలిస్తున్న ఆర్ఐవో

నెల్లూరు(విద్య), మార్చి 30 : ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి డాక్టర్ ఏ.శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని పలు కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలను ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. తరగతులు నిర్వహిస్తున్న పలు కళాశాలలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సంబంధిత కళాశాలల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటర్ విద్యామండలి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల కింద నడుస్తున్న జూనియర్ కళాశాలలకు ఈనెల 29 నుంచి మే 31వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించారన్నారు. కొన్ని కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నట్లు గుర్తించామని, వాటిపై రిపోర్టు తయారు చేసి ఇంటర్ బోర్డుకు పంపిస్తామన్నారు. అన్ని జూనియర్ కళాశాలలు 2024-25 విద్యా సంవత్సరానికి జూన్ 1వ తేదీ నుంచి పునఃప్రారంభించాలన్నారు. సెలవుల్లో నీట్, జేఈఈ, బ్రిడ్జ్ కోర్సుల పేరుతో కోచింగ్, తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే రానున్న విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల కోసం మోసపూరిత ప్రకటనలతో తల్లిదండ్రులను మభ్యపెడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఇంటర్‌బోర్డు ఎలాంటి అడ్మిషన్ల షెడ్యూల్ విడుదల చేయలేదన్నారు. తల్లిదండ్రులు ఏదైనా సమాచారం కావాలంటే ఆర్ఐవో కార్యాలయంలో 0861-2320312ను సంప్రదించాలన్నారు.

స్పాట్‌కు ఎగ్జామినర్లను పంపించాలి

ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించిన స్పాట్ వాల్యూయేషన్‌కు ఎగ్జామినర్లుగా నియమించిన లెక్చరర్లు తప్పనిసరిగా విధులకు హాజరు కావాలని, ప్రిన్సిపాళ్లు వారిని వెంటనే రిలీవ్ చేయాలన్నారు. హాజరుకాని ఎగ్జామినర్లకు రోజుకు రూ.వెయ్యి వంతున జరిమానా విధిస్తామని, సంబంధిత కళాశాల గుర్తింపు రద్దుకు సిఫార్సు చేస్తామన్నారు. ఇప్పటి వరకు విధులకు హాజరు కాని ఇంగ్లీష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ అధ్యాపకులు వెంటనే నగరంలోని స్టోన్‌హౌస్‌పేట కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని స్పాట్ సెంటర్‌లో రిపోర్టు చేయాలని తెలిపారు.

వైభవంగా ధ్వజావరోహణం

● నేడు తెప్పోత్సవం



నెల్లూరు (సాంస్కృతికం): తల్పగిరి రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ధ్వజావరోహణం వైభవంగా జరిగింది. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీరంగనాథస్వామికి వివిధ సుగంధ పుష్పాల తో పుష్పయాగం జరిగింది. అనంతరం దవనోత్సవం జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి పెన్నానదిలో తెప్పోత్సవం వైభవంగా జరుగుతుందని ఆలయ ఛైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, సహాయ కమిషనర్ డబ్బుగుంట వెంకటేశ్వర్లు తెలిపారు.



పిడూరులో బియ్యం వాహనంపై ఉన్న జగన్‌చిత్రం చూపుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ఇది ఉల్లంఘన కాదా..?

● ఎన్నికల అధికారులపై సోమిరెడ్డి ఆగ్రహం

మనుబోలు, మార్చి 30: బియ్యం వాహనాలపై ఉన్న జగన్ చిత్రాలను చూపుతూ మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కాదా అంటూ ప్రశ్నించారు. మండలంలోని పిడూరు గ్రామంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమానికి ఆయన శనివారం విచ్చేశారు. మిక్సిడ్ కాలనీలో పర్యటిస్తుండగా అక్కడ ఉన్న రెండు బియ్యం వాహనాలపై జగన్ చిత్రాలు ఉండడంతో సోమిరెడ్డి ఎన్నికల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఈసీకి ఫిర్యాదు చేస్తామన్నారు. చిత్రాలపై పెయింట్ చేయించాల్సి ఉండగా కేవలం పేపర్లు అంటించామని, పోయాయని చెప్పడం కరెక్ట్ కాదన్నారు. గూడూరు నియోజకవర్గంకు చెందిన బియ్యం వాహనాలు, దానికి డ్రైవర్లు పిడూరుకి చెందిన యువకులు కావడంతో పిడూరులో వాహనాలు ఉంచారు.

సోమశిలలో 9.959 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, మార్చి 30: సోమశిల పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారానికి ప్రాజెక్టులో 9.959 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ ఉత్తర కాలువకు 50, డెల్టాకు 920, దక్షిణ కాలువకు 250 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

నిర్వహణ లేక నీరుగారిన లక్ష్యం

- నిరుపయోగంగా సౌరవిద్యుత్ ఆధారిత నీటి పథకాలు
- 2015లో కేంద్రం ఏర్పాటు
- మొరాయించిన సౌర పలకలు
- తీరని తాగునీటి ఇబ్బందులు

సీతారామపురం, మార్చి 30: జనాభా 250 మంది లోపు ఉండి, ఓవర్ హెడ్ ట్యాంకులు లేని, విద్యుత్ సమస్య ఉన్న గ్రామాలు, కాలనీలకు చేతి పంపుల నీరే ఆధారం. ఇలాంటి ప్రాంతాల్లో సౌర విద్యుత్ ఆధారంగా చేతిపంపులకు మోటార్లు అమర్చి సమస్యను పరిష్కరించేందుకు కేంద్రప్రభుత్వం 2015లో శ్రీకారం చుట్టింది. ఒక్కోదానికి రూ.4.90లక్షలు వ్యయం ఖర్చు చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థకు పనులు అప్పగించింది. బోరు సమీపంలో 5వేల లీటర్ల సామర్థ్యం ఉన్న సింథటిక్ ట్యాంకులు, దాని పైన నాలుగు సౌర పలకలు ఏర్పాటు చేశారు. సౌర విద్యుత్ ఆధారంగా మోటార్లు ఆటోమేటిక్ ఆన్‌అయి బోరు నీరు ట్యాంకులో చేరేలా వీటిని అమర్చారు. ట్యాంకు నిండగానే మోటారు ఆగిపోతాది. చేతి పంపును సాధారణంగానూ వినియోగించుకునే వీలు ఉంటుంది. సాధారణంగా చేతిపంపుల్లో 80 నుంచి 120 అడుగుల వరకు పైపులు అమర్చుతారు. సౌర నీటి పథకంలో 200అడుగుల్లోని నీరు కూడా ట్యాంకుకు చేరేలా చర్యలు తీసుకున్నారు.

మండలంలో ఎక్కడెక్కడ ఏర్పాటు..

పెద్దనాగంపల్లి ఎస్సీ కాలనీ, గోనువారిపల్లి, చింతూడు, రంగనాయుడుపల్లి ఎస్టీకాలనీ, పంద్రంగి గ్రామాల్లో తాగునీటి పథకాలకు సౌర విద్యుత్‌ను ఏర్పాటు చేసింది. మొదట్లో కొన్నినెలలు సౌర పథకాలు సక్రమంగా పనిచేయడంతో నీటి ఇబ్బందులు తీరాయని కాలనీల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. మరమ్మతులకు గురైతే వాటిని పట్టించుకునేవారు లేకపోవడంతో ఈ పథకాలు నిరుయోగంగా ఉన్నాయి. పంద్రంగి గ్రామంలో తప్ప మిగతా గ్రామాల్లో ఇవి నిరుప యోగంగా ఉన్నాయి. మా గ్రామాల్లో తాగునీటి సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని ప్రజలు వాపోతున్నారు. కొన్నిచోట్ల సౌర పలకలు ఏర్పాటు చేసిన నెలల కిందటే ఊడిపోయినా ఇంతవరకు వాటిని అతికించి ఉపయోగంలోకి తెచ్చే పనులు చేపట్ట లేదు. ఉన్నతాశయంతో ఏర్పాటు చేసిన వీటిని వినియోగంలోకి తెస్తే లక్ష్యం నెరవేరడంతో పాటు పంచాయతీలకు విద్యుత్ బిల్లుల సమస్య ఉండదని పల్లెవాసులు చర్చించుకుంటున్నారు.



పెద్దనాగంపల్లి ఎస్సీ కాలనీలోని సౌర విద్యుత్ ఆధారిత నీటి పథకం

అధ్వానపు రోడ్లు..అవస్థల ప్రయాణం!

ఏఎస్ పేట, మార్చి 30 : మండలంలోని గ్రామీణ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ప్రధానంగా చౌటభీమవరం నుంచి ఆత్మకూరు-వింజమూరుకు వెళ్లే ప్రధాన రహదారి ఇరవై ఏళ్లుగా అధ్వానంగా ఉంది. ప్రజలు రాకపోకలు సాగించాలంటే అవస్థలు పడుతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఈ రోడ్డు మాత్రం మారలేదు. ఆ ఊరు నియోజకవర్గ కేంద్రానికి నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉన్నది. ప్రతిరోజూ విద్యార్థులు ఆత్మకూరు, వింజమూరుల్లోని పాఠశాలలు, కళాశాలలకు, వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో తారురోడ్డు వేయాలని గ్రామస్థులు కొన్నేళ్లుగా అధికారులు, నాయకుల చుట్టూ తిరిగి అర్జీలు అందించినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. వర్షం కురిస్తే బురదతోపాటు పెద్ద గుంతలతో రాకపోకలు సాగించడం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది గ్రామ యువకులు సొంత నిధులతో రోడ్డుపైన గుంతలకు మట్టి వేసి చదును చేశారు. ముస్తాపురం నుంచి ఏఎస్ పేట వరకు రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. ఆదమరిస్తే ప్రమాదాలు తప్పవు. ప్రతిరోజూ హైదారాబాదు, బెంగళూరు నుంచే కాక పలు రాష్ట్రాల నుంచి యాత్రికులు ఏఎస్ పేటకు దర్గాకు వస్తుంటారు. రోడ్డు దెబ్బతినడంతో వాహనదారులు ఈ మార్గంలో తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇటీవల దర్గాలో గంధోత్సవం నిర్వహిస్తే దేశం నలుమూలల నుంచి యాత్రికులు వచ్చారు. ఆత్మకూరు-వింజమూరు ప్రధాన రహదారి నుంచి వెళ్లే దూబగుంట రోడ్డు పరిస్థితి అలాగే ఉన్నది. గుడిపాడు నుంచి కొత్తపల్లి రహదారితో పాటు పలు గ్రామీణ రహదారులు దారుణంగా ఉన్నాయి. పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలని కోరుతున్నారు.



ఏఎస్ పేట-ఆత్మకూరు రోడ్డు దుస్థితి

చంద్రబాబుతో చింతల శ్రీను భేటీ



సీతారామపురం, మార్చి 30: ప్రజాగళం కార్యక్రమం కోసం వింజమూరుకి వచ్చిన చంద్రబాబునాయుడును శనివారం మండల సీనియర్ నాయకులు చింతల శ్రీనివాసులు కలిశారు. మండల సమస్యలను అధినేత దృష్టికి తీసుకెళ్లాడు. విషయాలన్నీ ఓపిగ్గా ఆలకించిన టీడీపీ అధినాయకుడు ఈ ఎన్నికల్లో నియోజకవర్గ అభ్యర్థి కాకర్ల సురేష్‌ని అత్య ధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

ఎన్నికల సిబ్బందికి ముగిసిన శిక్షణ

ఉదయగిరి రూరల్: స్థానిక మేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ కళాశాలలో రెండు రోజులుగా ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు జరుగుతున్న శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్‌ప్రేమ్‌కుమార్, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నెహ్రూబాబు సిబ్బందికి సలహాలు అందజేశారు.

సర్టిఫికెట్ల గడువు నేటితో ముగింపు

ఉదయగిరి, మార్చి 30: విశ్రాంత ఉద్యోగులు తమ లైఫ్ సర్టిఫికెట్లను ఆదివారం సాయంత్రంలోపు అందజేయాలని ఉదయగిరి సబ్ ట్రెజరీ సీనియర్ అసిస్టెంట్ బొమ్మతట్టు శ్రీహరి తెలిపారు. శనివారం ఆయన ఈ విషయంపై మాట్లాడారు. వివిధ కారణాలతో నెలాఖరులోగా అందించలేకపోయినా విశ్రాంత ఉద్యోగులు ఆన్‌లైన్‌లో లేక స్వయంగా అందజేయాలన్నారు. ఉదయగిరి సబ్ ట్రెజరీ పరిధిలో 784మంది విశ్రాంత ఉద్యోగ పెన్షనర్లు ఉన్నారని, వీరిలో 15మంది అందజేయలేదన్నారు..

మద్యం దుకాణాల తనిఖీ



ఉదయగిరి, మార్చి 30: పట్టణంలోని గండిపాళెంకు వెళ్లే మార్గంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను శనివారం ఒంగోలు విజిలెన్స్ స్పెషల్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. మద్యం దుకాణాల్లో నిల్వలు, నగదు బ్యాలెన్స్ రికార్డులు పరిశీలించి సలహాలు అందజేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయపాలన పాటించి ప్రభుత్వ ధరలకే మద్యం విక్రయించాలన్నారు. ప్రతివ్యక్తికి మూడు మద్యం సీసాలకు మించి ఇవ్వరాదన్నారు. వారి వెంట స్పెషల్ స్క్వాడ్ బృందం సీఐ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పదవీ విరమణ హెచ్‌ఎంకు సన్మానం



సంగం, మార్చి 30: వెంగారెడ్డిపాళెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తూ శనివారం పదవీ విరమణ చేసిన సీహెచ్ ఈశ్వరయ్యను సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఉపాధ్యాయురాలు రోజా రమణి, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆత్మకూరు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా..

- టీడీపీ విజయానికి కృషి చేయండి : ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, మార్చి 30: నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విజయానికి అన్నివర్గాల ప్రజలు సంపూర్ణ మద్దతిచ్చి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారా యణరెడ్డి కోరారు. శనివారం ఆయన పట్టణంలోని బార్, క్లాత్, గోల్డ్ అండ్ సిల్వర్, ప్రొవిజన్స్, ఆయిల్, డిస్ట్రిబ్యూషన్ అసోషియేషన్స్ అధ్యక్షులు, వ్యాపారులను కలిసి మద్దతు అడిగారు. ఈ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి వచ్చి నారా చంద్రబాబునాయుడు సీఎం కావడం తథ్యమన్నారు.



టీడీపీ మద్దతుదారులు, అభిమానులతో ఆనం రామనారాయణరెడ్డి

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

ఆత్మకూరు మార్చి 30: వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యమని, కేంద్రం నిధులతోనే కొంత మేర అభివృద్ధి పనులు చేసినట్లు బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు కర్నాటి ఆంజనేయరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం బుజ్జిరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ కంది మల్లికార్జునరెడ్డి తెలిపారు. శనివారం ఆత్మకూరులోని జేఆర్‌పేటలో పార్టీ నూతన కార్యా లయాన్ని ప్రారంభించి మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో రాబోయేది ఎన్డీయే ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. ఆత్మకూరులో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనా రాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి వీపీఆర్ గెలుపు ఖాయమన్నారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విజయానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, పట్టణ, రూరల్ అధ్యక్షులు కరటంపాటి సుధాకర్, వాసిపల్లి సుధాకర్‌రెడ్డి, బాలయ్య పాల్గొన్నారు.



బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నేతలు

పుచ్చకాయలకు భలే డిమాండ్!

- సైజులు బట్టి ధరలు
- రూ.50 నుంచి 150 వరకు విక్రయం



ఉదయగిరిలో విక్రయానికి సిద్ధంగా పుచ్చకాయలు

ఉదయగిరి, మార్చి 30: ఈ ఏడాది వేసవికాలంలో ముందస్తుగానే ఎండల తీవ్రత పెరగడంతో పుచ్చకాయల అమ్మకాలకు భలే డిమాండ్ పెరిగింది. సహజంగానే ఈ సీజన్‌లో కాయలకు గిరాకీ ఎక్కువ. ఉదయగిరి ప్రాంతంలో సైజును బట్టి పుచ్చకాయ ధర రూ.50 నుంచి రూ.150 వరకు అమ్ముతున్నారు. అలాగే కిలో రూ.25ల చొప్పున విక్రయిస్తున్నారు.

పల్లెల్లో ప్రత్యేక బలగాల కవాతు

అనంతసాగరం, మార్చి 30: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గుడిగుంట పంచాయతీ లోని ఎగువపల్లి, యాకర్ల పాడులో శనివారం పోలీసులు ప్రతేక బలగాలు కవాతు నిర్వహించారు. సోమశిల పోలీసుస్టేషన్ పరిధిలో ఎస్ఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.



కవాతు నిర్వహిస్తున్న ప్రత్యేక బలగాలు



అనివేటి మండపానికి విరాళం

కందుకూరు : గ్రామదేవత అంకమ్మ ఆలయ పునర్నిర్మాణానికి కందుకూరు వాసి, సినీనటుడు ఇంటూరి మల్లి కార్జునరావు శనివారం రూ. 50,116 విరాళం అందజేశారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి సమక్షంలో ఆలయ క మిటీ సభ్యులకు ఈ మొత్తాన్ని ఆయన అందించారు. అనం తరం మల్లికార్జునరావు మాట్లాడుతూ అంకమ్మ ఆలయ పునర్నిర్మాణం మొదటిదశ ఎమ్మెల్యే పర్యవేక్షణలో విజయ వంతంగా పూర్తయిందని, అనివేటి మండపానికి తమవం తు భాగస్వామ్యంగా ఈ విరాళం అందించినట్లు తెలిపారు.

మూలపడ్డ చెత్త తరలింపు వాహనాలు

అల్లూరు, మార్చి 30: చెత్తపై పన్ను వసూలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. అందులో భాగంగా తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించేందుకు వాహనాలను కూడా ఏర్పాటు చే సింది. అయితే ఆ వాహనాలు అ ల్లూరు నగర పంచాయతీలో మూల పడ్డాయి. సచివాలయాల దగ్గర వాటిని పడేసి అధికారులు పట్టించుకోకుండా వదలేశారు. మొదట్లో కొద్దిరోజులు మాత్రం చెత్తను సేకరించారు. కానీ ప్రస్తుతం ఆ వాహనాలు మూలన పడిఉన్నాయి. వాటిని వినియోగం లోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



నాలుగేళ్లుగా నిండని చెరువులు

- పంటలు సాగుచేయని రైతులు
- రాళ్లపాడు నీళ్లివ్వాలని వినతి

లింగసముద్రం, మార్చి 30: మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో లింగసముద్రంలోని పాత, కొత్త చెరువుల్లో అరకొరగా నీరుచేరాయి. ఆ నీటితో పంటలు పండించలేమని రైతులు సాగుకు స్వస్తి పలికారు. పాత చెరువు కింద లింగసముద్రం, తిమ్మారెడ్డిపాలెం, శింగరపాలెం, గంగపాలెం గ్రామాలకు చెందిన సుమారు 700 ఎకరాల ఆయకట్టు ఉంది. నాలుగేళ్లుగా చెరువు నిండక చెరువులోనూ, ఆయకట్టులోనూ చిల్లచెట్లు పెరిగాయి. అయితే కొద్దిమంది రైతులు బోర్ల కింద తిండి గింజల కోసం వరిపైరు, పశువుల మేతకు జొన్న సాగు చేశారు. గత ఏడాది కూడా కొత్త చెరువులో చుక్క నీరు లేకపోవడంతో సుమారు 115 ఎకరాల ఆయకట్టు బీడుగా మారింది. పంటలు పండక రైతులు, రైతు కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.గ్రాసం లేక పశువులు కూడా అల్లాడుతున్నాయి.

రాళ్లపాడు నీరివ్వాలి

లింగసముద్రం పాత, కొత్త చెరువులు నిండితేనే రైతులు పంటలు సాగు చేస్తారు. నాలుగేళ్ల నుంచి సరిగా నీరు రాక పోవడంతో సాగు లేదు. ఈ చెరువులకు రాళ్లపాడు ప్రాజెక్టు దక్షిణం కాలువ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరివ్వాలి. అధికారులు ఈ దిశగా చర్యలు చేపట్టాలి. **-పొలిమేర వెంకటేశ్వర్లు రైతు, తిమ్మారెడ్డిపాలెం**





నాలుగేళ్లుగా నీళ్లులేక చిల్లచెట్లు మొలిచిన లింగసముద్రం పాత చెరువు

తెలుగుదేశంలోకి తెట్టు గ్రామస్థులు

కందుకూరు,మార్చి30: గుడ్లూరు మండలం తెట్టు గ్రామానికి చెందిన పలు బీసీ కుటుంబాలు శనివారం వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరాయి. గ్రామపార్టీ అధ్యక్షుడు మద్దసాని శ్రీనివాసులు ఆధ్వర్యంలో వారంతా స్థానిక పార్టీ కార్యాలయానికి తరలివచ్చి ఇంటూరి సమక్షంలో పార్టీలో చేరారు. వారందరికీ కండువాలు కప్పి నాగేశ్వరరావు పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జనిగర్ల నాగరాజు, మద్దసాని కృష్ణ, యర్రంశెట్టి వెంకటేశ్వర్లు, కుందుర్తి రాంబాబు, తాళ్లపాలెం బాలకృష్ణ, దారా వెంకటరావు, చిత్తారి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి చీమలపెంట వాసులు

లింగసముద్రం : కందుకూరు టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో శనివారం రాత్రి మండలంలోని చీమలపెంట గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున టీడీపీలో చేరారు. గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గంగినేని మధుసూదనరావు, 8, 9 వార్డు సభ్యులు చలంకూరి అంజమ్మ, మదమంచి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచి కరణం నారాయణ, మాజీ ఉప సర్పంచి కల్లగుంట నరసింహం, బొల్లినేని నాగేశ్వరరావు, ఆంజనేయులతోపాటు ఇంకా పలు కుటుంబాల వారు టీడీపీలో చేరారు.



కందుకూరు : ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరిన తెట్టు వైసీపీ కార్యకర్తలు

జీసస్ మార్గం ఆచరణీయం : కావ్య

కావలిటౌన్, మార్చి30: జీసస్ మార్గం ఆచరణీయమని కావలి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలో ఆరాధన టీవీ, డివిజన్ పాస్టర్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో రన్‌ఫర్ జీసస్ కార్యక్రమం జరిగింది. ఏటీఎం కాంపౌండ్ వద్ద కావ్య కృష్ణారెడ్డి ర్యాలీని ప్రారంభించారు. ట్రంకురోడ్డు మీదుగా ర్యాలీ సాగింది. కార్యక్రమంలో ఆరాధన టీవీ కో-ఆర్డినేటర్ పాడేటి థామస్, పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏసుబాబు, బోగిరి జయసుందరరావు, శివప్రసాద్‌రెడ్డి, విన్సెంట్, జీవన్ పాల్గొన్నారు.

- ప్రజలు మార్పు కోరుకుంటున్నారు..

కావలి : ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని టీడీపీ. జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి శనవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావలిలో శుక్రవారం నిర్వహించిన ప్రజాగళం విజయవంతం చేసిన ప్రజలకు, అభిమానులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రజాగళం సభకు పెద్దఎత్తున విచ్చేసి టీడీపీపై ప్రజలు అభిమానం చూపారంటే రాష్ట్రంలో మార్పు కోరుకుంటున్నారనేందుకు సంకేతామన్నారు. నియోజకవర్గంలో ప్రజల ఆదరణ చూస్తుంటే టీడీపీ ఘన విజయం సాధించబోతుందన్నారు. జగన్‌రెడ్డి పాలనలో ప్రజలు చాలా కష్టాలు పడ్డారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రాన్ని జగన్ అప్పులపాలు చేశాడని, ఒకటోతేదీకి ఉద్యోగులెవరికి జీతాలు అందటం లేదన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఉద్యోగులందరికి ఒకటో తేదీకి జీతాలు అందుతాయన్నారు. పింఛన్ రూ.4 వేలకు పెంచి మీ ఇంటికి అందచేసే బాధ్యత టీడీపీ తీసుకుంటుందన్నారు. రాష్ట్రం భవిష్యత్తుకోసం చంద్రబాబును సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి

మాలకొండ ఆదాయం రూ.8,72,379

వలేటివారిపాలెం, మార్చి 30: మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి 8,73,379 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.బీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టికెట్‌ల ద్వారా రూ. 7,650, కుంకుమార్చన ద్వారా రూ. 30,360, వివాహాల ద్వారా రూ. 13 వేలు, తలనీలాల ద్వారా రూ. 33,150, వాహనపూజల ద్వారా రూ. 3,160, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 3,01,500, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 6,00, రూముఅద్దెల ద్వారా రూ. 32,460, కవర్లు ద్వారా రూ. 5,400, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 1,87,220, అన్నదానం ద్వారా రూ. 2,49,263, విరాళాల రూపంలో రూ. 8,616 ఆదాయం లభించినట్లు ఆయన తెలిపారు.

పదవీ విరమణ సన్మానం



వెంకట సీతారామశర్మ దంపతులను సన్మానిస్తున్న డిప్యూటీ డీఈవో శ్రీనివాసరావు, ఎంఈవో తదితరులు

ఉలవపాడు : మండలంలోని పెదపట్టపుపాలెం ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు నాదెండ్ల వెంకట సీతారామశర్మ ఆదివారం పదవీ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం జ రిగిన కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో కే శ్రీనివాసరావు, ఎంఈవో ప్రసాదరావులు పాల్గొని సీతారామశర్మ సేవలను కొనియాడారు. అనంతరం హెచ్‌ఎం సలీం బాషా ఆధ్వర్యంలో సీతారామశర్మ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచు ఆవుల జయరాం, గ్రామపెద్దలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు నిజాలు తెలుసుకుని మాట్లాడాలి

కావలిటౌన్ : చంద్రబాబునాయుడు నిజాలు తెలుసుకుని మాట్లాడాలని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ముసునూరులోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 14ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు కావలి పర్యటనలో తనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సముచితం కాదన్నారు. వైసీపీ కావలిని అభివృద్ధి చేయలేదని అంటున్న చంద్రబాబు ఆయనేం చేశారో చెప్పాలన్నారు. సమావేశంలో పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు.

ప్రజాసేవలోనే సంతృప్తి : కంచి



ఆత్మకూరు : ప్రజాసేవే పరవాధిగా తాను పలు సేవకార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం సంతోషకరంగా ఉందని సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో అవుట్ పేషంట్లకు, వారి కుటుంబసభ్యులకు ప్రతిరోజు అన్నదానం కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో అన్నదానం చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం ఓ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ అంత్యక్రియల సహాయార్థం గా రూ.10 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కైలాశ రథంతో పాటు ఆరు శవపేటికలను అందుబాటులో ఉంచామన్నారు. వీటితో పాటు దేవాలయాల అభివృద్ధికి నిధులు అందజేయడం సంతోషకరంగా ఉందన్నారు. ముందుగా ఆయన సాంబశివ చారిటబుల్ ట్రస్ట్, తెలుగుభారతి సేవా సంసమితి సభ్యులు, అభిమానులతో కలిసి అన్నపూర్ణేశ్వరికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎస్సీపాలెంలో టీడీపీ నేతల ప్రచారం



ఎస్సీపాలెంలో ఇంటింటి ప్రచారంలో తెలుగు తమ్ముళ్లు

బిట్రగుంట : బోగోలు మండలం ఎస్సీపాలెం దళితవాడల్లో మండల తెలుగు యువత అధ్యక్షుడు అన్నంగి ఆది శేషయ్య యాదవ్ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటి ప్రచారం జరిగింది. టీడీపీ ఉమ్మడి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కావలి అసెంబ్లీ అభ్యర్థి కావ్యక్రిష్ణారెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పెయ్యల శీనయ్య, రాజు శ్రీనివాసులురెడ్డి, కాకి తిరుపతి, ఇష్టాటి సుబ్బారెడ్డి, ఆట్ల రమేష్‌రెడ్డి, మానికల రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ డంపింగ్‌యార్డు పరిశీలన

కందుకూరు, మార్చి 30: పట్టణంలోని గుర్రంవారిపాలెంలో ఉన్న డంపింగ్‌యార్డును సబ్ కలెక్టరు విద్యాధరి శనివారం రాత్రి పరిశీలించారు. రెండురోజులుగా డంపింగ్‌యార్డులో మంటలు చెలరేగి పొగ వ్యాపించడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తూ ఆమెకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ కొన్నేళ్లుగా డంపింగ్‌యార్డు వల్ల పడుతున్న ఇబ్బందులను ఆమెదృష్టికి తీసుకువచ్చి ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన ఆమె సమస్య పరిష్కారానికి తక్షణం చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.



డంపింగ్‌యార్డు సమస్యను సబ్ కలెక్టరుకు వివరిస్తున్న స్థానికులు

వినియోగదారుల హక్కుల ఫోరం ఈసీగా కిషోర్

బిట్రగుంట, మార్చి 30: బోగోలు మండలం రామస్వామిపాలెంకు చెందిన ఎల్.కిషోర్‌ను మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమిస్తూ శనివారం మండల ఏపీ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం కన్వీనర్ జయానందం గుర్తింపు కార్డును అందచేశారు.వినియోగదారుల భద్రతే లక్ష్యంగా తాను కృషి చేస్తానని కిషోర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్డీ అక్బర్, ట్రెజరర్ చంద్రహాస్, తదితరులు పాల్గొన్నారు.



కిషోర్‌కు గుర్తింపు కార్డు అందచేస్తున్న జయానందం

బోగోలు వైసీపీలో వర్గపోరు

బిట్రగుంట, మార్చి 30: బోగోలులో కొంతమంది వైసీపీ నేతల వైఖరి కారణంగా వర్గపోరు రోజురోజుకు పెరుగుతోంది. ఈ క్రమంలో పలువురు ఆ పార్టీ నాయకులు టీడీపీలోకి చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. త్వరలో కావలి టీడీపీ అభ్యర్థి కావ్యక్రిష్ణారెడ్డిని సంప్రదించి పార్టీలో చేరతామని అసమ్మతి వైసీపీ నేతలు పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ అవసరం లేదు : మహీధర్‌రెడ్డి

కందుకూరు, మార్చి 30: తనకు ఎమ్మెల్సీ పదవి వద్దని ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం పట్టణంలోని వెంగమాంబ ఫంక్షన్‌హాలులో వైసీపీ నేతల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆ పార్టీ అభ్యర్థులు విజయసాయిరెడ్డి, బుర్రా మధుసూదన్‌యాదవ్‌లతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. మహీధరరెడ్డి మాట్లాడుతూ తనకు ఇచ్చిన ఆఫర్‌ను తాను కోరుకోవటం లేదన్నారు. నేడు రాజకీయాలు చాలా కాస్ట్‌లీగా మారిపోయాయని, తాను ఏనాడూ కులరాజకీయాలు చేయలేదన్నారు. తనకు టికెట్ రానప్పుడు పోటీచేయాలని కొందరు ఒత్తిడి చేశారని తెలిపారు. విజయసాయిరెడ్డి మాట్లాడుతూ కందుకూరులో మహీధరన్న సహకారం లేకుండా తాను, మధుసూదన్ గెలవలేమని అన్నారు.

టీడీపీలో న్యాయవాది చేరిక

కందుకూరు : పట్టణానికి చెందిన వైసీపీకి చెందిన న్యాయవాది ఉప్పుటూరి రాజేంద్రప్రసాద్ టీడీపీలో చేరారు. టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో శనివారం ఆయన పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఉన్నం వీరాస్వామి, దామా మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మక్కా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు : కందుకూరు టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు శనివారం రాత్రి పట్టణంలోని మక్కా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలతో కలిసి ఆయన ప్రార్థనల్లో పాల్గొన్నారు. టీడీపీకి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు షేక్ ఫిరోజ్, మియా, రూబీ, గౌస్, సలాం, మున్నా, జమీల్, ఖలీల్, నజీర్, షాకీర్, సలీం తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లిలో వైసీపీ ఖాళీ కావడం ఖాయం : సోమిరెడ్డి



వెంకటాచలం: టీడీపీలో చేరిన మాజీ సర్పంచు, వార్డు సభ్యులు తదితరులతో సోమిరెడ్డి

వెంకటాచలం, మార్చి 30: సర్వేపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి టీడీపీలో చేరేందుకు వైసీపీ కీలక నాయకులు సిద్ధంగా ఉన్నారని, వచ్చేనెల చివరికల్లా వైసీపీ పూర్తిగా ఖాళీ అవ్వడం ఖాయమని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. వేదాయపాళెంలో ఉన్న సోమిరెడ్డి కార్యాలయంలో శనివారం వెంకటాచలం మాజీ సర్పంచి మందల మోహనయ్యతో పాటు మాజీ వార్డు సభ్యులు చల్లా రమణయ్య, ఉప్పు అంకయ్య, యువనేత చల్లా వెంకటేష్, మరో 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేంద్రప్రసాద్, మండలాధ్యక్షుడు రాజాయాదవ్, నాయకులు వలిపి మునుస్వామి, మందల మణి, ఖాయ్యుమ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

తోటపల్లిగూడూరు: సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమిరెడ్డి ఆదేశానుసారం తోటపల్లిగూడూరు మండలం క్లస్టర్-4 ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలను వీరబోయిన గంగాధర్‌కు శనివారం అప్పజెప్పారు. అనంతరం సోమిరెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. అనంతరం సోమిరెడ్డిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, శ్యామ్‌సుందర్‌రెడ్డి, తమ్మిరెడ్డి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

25 కుటుంబాలు టీడీపీలో చేరిక

ముత్తుకూరు: వైసీపీని వీడి టీడీపీలో చేరిన కృష్ణపట్నంకు చెందిన 25 కుటుంబాలను కండువాలు కప్పి సోమిరెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు ఏకొల్లు కోదండయ్య తదితరులు పాల్గొన్నారు.

పిడూరులో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ

మనుబోలు: మండలంలోని పిడూరులో శనివారం టీడీపీ నాయకులు తిక్కవరపు సోదరులు శ్రీధర్‌రెడ్డి- వెంకటేశ్వర్లు రెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గ్రామంలో పర్యటించి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. సోమిరెడ్డి కుటుంబీకులంతా గ్రామానికి విచ్చేసి ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, తిక్కవరపు శ్రీధర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు రెడ్డి, మానుగుంట సుధాకర్‌రెడ్డి, కేవి కృష్ణయ్య, నీలపురెడ్డి పద్మనాభరెడ్డి, రమేష్ రెడ్డి, మోహన్, మండల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా నృసింహుడి కల్యాణం


నృసింహస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు(డక్కిలి), మార్చి 30: పెంచలకోన నృసింహస్వామికి శనివారం స్వామి వారి స్వాతి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని అర్చకులు కల్యాణం నిర్వహించారు. ఉదయం 4గంటలకు ఉత్సవమూర్తికి అభిషేకం, చందనాలంకారం, ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. సాయంత్రం స్వామి ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఉప కమిషనర్ కేవీ సాగర్ బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ

తోటపల్లిగూడూరు, మార్చి 30: మండలంలోని సౌత్ ఆములూరు మండల ప్రజాపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం పాఠశాల వార్షికోత్సవం, సరస్వతీ పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ అహ్మద్‌బాషా మాట్లాడుతూ విద్యార్థులంతా బాగా చదివి రాబోయే వార్షిక పరీక్షలలో ప్రతిభ చూపాలని కోరారు. కాగా, పాఠశాలలో కొత్తగా చేరే విద్యార్థులచే అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం జరిగిన పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కె వసంతలక్ష్మీ, కె హెప్సీవిద్యుల్లత, బి కృష్ణవేణి, బి నాగరాజు, సునీజ, పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల వేషధారణ


పైనాపిల్ ఆకారంలో చిన్నారి వేషధారణ

బుచ్చిరెడ్డిపాలెం, మార్చి 30 : స్థానిక గ్లోబల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శనివారం నిర్వహించిన ఈ డాక్‌డే యాక్టివిటీ కార్యక్రమంలో చిన్నారుల వేష ధారణలు అందరినీ అలరించాయి. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టులో ఎస్పీ తనిఖీ



ఎస్పీతో మాట్లాడుతున్న పోలీసులు

మనుబోలు, మార్చి 30: మండల పరిధిలోని జాతీయ రహదారిపై బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాల తనిఖీ, సీసీ కెమెరాల పనితీరు, రికార్డుల వివరాలను ఆయన పరి శీలించి సిబ్బందికి సూచనలు చేశారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరంజనేయులు, ఎస్‌ఐ అజయ్ కుమార్‌లు పాల్గొన్నారు.

సైదాపురంలో....

సైదాపురం: మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శనివారం ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి పరిశీలించారు. వీరివెంట ఎస్‌ఐ విజయ్‌కుమార్ ఉన్నారు.

సీహెచ్‌సీలో సీటీజీ పరికరం ఏర్పాటుకు వితరణ

బుచ్చిరెడ్డిపాలెం, మార్చి 30: స్థానిక సీహెచ్‌సీ (ప్రభుత్వ ఆసుపత్రి)లో పేద మహిళలకు పరీక్షలు నిర్వహించడం కోసం సీటీజీ పరికరం ఏర్పాటుకు దాతలు దొడ్ల వరదారెడ్డి, రుక్మిణమ్మ ట్రస్ట్ నుంచి రూ.75వేలు, దొడ్ల పార్థసారథి రెడ్డి ట్రస్ట్ నుంచి రూ.75వేలు మొత్తం రూ.1.50లక్షలు మాజీ ఎంపీపీ దొడ్ల విజయమ్మ భర్త కోదండ రామిరెడ్డి చేతుల మీదుగా శనివారం ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పద్మజకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రిలోని వైద్యులు, సిబ్బంది కొట్టేపాలెం కామయ్య, కామాక్షయ్య, ఆలూరి కవీన్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

తోటపల్లిగూడూరు: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని మండలాభివృద్ధి అధికారి నారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల అధికారులతో ఎన్నికల నిబంధనలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యద ర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, వలంటీర్లు, వరిగొండ, కోడూరు పీహెచ్‌సీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాయల్ కాప్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గంగిశెట్టి నరసింహ

నెల్లూరు (సాంస్కృతికం): రాయల్ కాప్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా నెల్లూరు నగరానికి చెందిన గంగిశెట్టి నరసింహ నియమితులయ్యారు. శనివా రం రాయల్ కాప్స్ ఫౌండర్, ఛైర్మన్ బోయళ్ల దేవినాయుడు చేతుల మీదుగా గుంటూరులో నియామకపత్రాన్ని అందుకున్నారు.

ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరికలు


టీడీపీలో చేరిన నాయకులు

నెల్లూరు (హరనాథపురం), మార్చి 30: కోవూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరికలు రోజురోజుకు పెరుగు తున్నాయి. వైసీపీ నుంచి టీడీపీలోకి నాయకులు భారీగా చేరు తున్నారు. టీడీపీ నాయకుడు మల్లా రెడ్డి ఆధ్వర్యంలో కోవూరు మండలం పాటూరు బిట్-2 వైస్ ఎంపీపీ జి సాయిలక్ష్మి, భర్త వెంకటరమణయ్య పార్టీలో చేరారు. వారికి ప్రశాంతిరెడ్డి టీడీపీ కండువాకప్పి సాదరంగా ఆహ్వానించారు.

ప్రశాంతిరెడ్డిని గెలిపించాలంటూ ప్రచారం


ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

కొడవలూరు: కోవూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డితోనే నియోజకవర్గంలో పేదల అభివృద్ధి సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు సిరిమామిళ్ల రవి బాబు అన్నారు. మండలంలో పాతవంగళ్లు పంచాయతీలో టీడీపీ నాయకురాలు సిరి మామిళ్ల నళినీ ఆధ్వర్యంలో శనివారం వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని గెలిపించాలంటూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి టీడీపీ కర పత్రాలను పంపిణీ చేశారు. అలాగే జిల్లా అభివృద్ధి చెందాలంటే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీగా గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎం రవి, చంద్ర, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా !

● వెంకటగిరి టీడీపీ అభ్యర్థి లక్ష్మీ సాయిప్రియ


పంగిలిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న లక్ష్మీ సాయిప్రియ

రాపూరు(డక్కిలి), మార్చి 30: రాపూరు అభివృద్ధి గడిచిన ఐదేళ్లలో పూర్తిగా వెనుకబడి పోయిందని తనకు ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి చూపుతానని వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీ సాయిప్రియ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆమె పంగిలి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. వెంకటగిరిలో స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటరును తీసుకువచ్చి నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు ఆమె తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి శివరామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు దందవోలు వెంకటేశ్వర్లు రెడ్డి, నువ్వుల శివరామకృష్ణ, ఏడోటి కోటేశ్వర నాయుడు, పచ్చిగళ్ల రత్నయ్య పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



సెల్ఫీపాయింట్‌లో జేసీ సేతుమాధవన్

కోవూరు, మార్చి 30: యువతీ, యువకుల ందరూ ఓటుహక్కును తప్పక వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ కోరారు. స్థానిక గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఆయన ఓటు హక్కు వినియోగంపై సెల్ఫీపాయింట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతనూ గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన సెల్ఫీపాయింట్ మే 11వరకు ఉంటుందని, యువతీ యువకులు సెల్ఫీ పాయంట్లలో సెల్ఫీలు తీయించుకోవాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించేందుకు స్వీప్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశామన్నారు.

టీడీపీలోనే ఉంటాం: మలిశెట్టి

తోటపల్లిగూడూరు, మార్చి 30 : మలిశెట్టి కుటుంబం వైసీపీలో చేరారని ఆ నాయకులు చేస్తున్న ప్రచారాన్ని కుటుంబీకులు, టీడీపీ నాయకులు శనివారం మీడియా సమావేశం నిర్వహించి ఖండించారు. అనంతరం మలిశెట్టి కార్తీక్ మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి మా కుటుంబ టీడీపీలోనే ఉందని, కేవలం మలిశెట్టి శేఖర్‌గౌడ్ మాత్రమే వైసీపీలో చేరారని తెలిపారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఇసుకపాలెం నుంచి మాజీ మంత్రి సోమిరెడ్డికి మెజారిటీ వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఇంగిలాల నిర్మలమ్మ, సర్పంచ్ చైతన్యకుమార్, మలిశెట్టి సూర్యనారాయణ, కోడూరు రమణయ్య, చెంగమ్మ, రాములమ్మ, సుబ్రహ్మణ్యం, ఇంగిలాల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఓటు వేయండి

నెల్లూరు(క్రైం), మార్చి 30: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని సంతపేట పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ సుబ్బరాజు సూచించారు. ఓటర్లకు ధైర్యం కల్పించేలా, చైతన్యవంతులను చేసేందుకు సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలోని సంతపేట, రంగానాయకులపేట, గాంధీగిరిజన కాలనీ, వారాధి సెంటర్, ఇసుకడొంక ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి స్థానిక పోలీసులు శనివారం కవాతు నిర్వహించారు. ప్రజలందరూ ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలన్నారు.


కవాతు నిర్వహిస్తున్న సంతపేట పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు

- మద్యం మత్తులో కార్ల డ్రైవింగ్
- ఆటోలు, సిటీ బస్సుల డ్రైవర్లు కూడా..
- ద్విచక్ర వాహనాదారులపైనే పోలీసుల ప్రతాపం

విచ్చలవిడిగా డ్రంక్ అండ్ డ్రైవ్!


కారులో మద్యం సీసా

నెల్లూరు(క్రైం), మార్చి 30 : డ్రంక్ అండ్ డ్రైవ్ విచ్చలవిడిగా జరుగుతోంది. కొందరు కార్లు, ఆటోలు, సిటీ బస్సుల డ్రైవర్లు మద్యం మత్తులో వాహనాలను వేగంగా నడుపుతున్నారు. వాటిపై అసలు దృష్టి సారించని పోలీసులు కేవలం ద్విచక్ర వాహనాదారులపైనే వారి ప్రతాప్ చూపుతున్నారు. ఇందుకు ఉదాహరణ గత బుధవారం రాత్రి 10 గంటలలోపే నగరంలోని మినీబైపాస్‌లో జరిగిన ఈ ఘటనే.. ఓ కారు వేగంగా వస్తూ ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొని వెళ్లింది. ద్విచక్ర వాహనదారుడు కారును వెంబడించి పక్కకు ఆపాలని సూచించాడు. ఆగిన కారు డ్రైవర్‌ను తన వాహనాన్ని ఎందుకు ఢీకొట్టావని ప్రశ్నించగా కారు నుంచి కిందకు దిగిన డ్రైవర్ మద్యం మత్తులో అక్కడే కింద పడిపోయాడు. దీంతో 112 కు ఫోన్ చేయగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని అతికష్టం మీద డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేశారు. ఈ సంఘటన చూ సిన ప్రజలు ఇంత మద్యం మత్తులో వేగంగా కారు నడిపిన వ్యక్తి మనుషుల పైకి వచ్చుంటే పరిస్థితి ఏమిటని చర్చించుకున్నారు.

మద్యం మత్తు ఎన్నో ప్రమాదాలకు కారణమై ఎన్నో జీవితాలను చిదిమేస్తోంది. జిల్లాలో ఇటీవల జరుగుతున్న ప్రమాదాల్లో అధికంగా మద్యం మత్తులో జరుగుతున్నవే. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి నెల జరిగే ప్రమాదాల నివారణ సమావేశంలో తరచూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లను నిర్వహించాలని ఆదేశాలు జారీ చేస్తూనే ఉన్నా పోలీసులు మాత్రం ఆ టెస్ట్‌లు కేవలం ద్విచక్ర వాహనదారులకే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. బార్లు, ప్రధాన కూడళ్లలో ద్విచక్ర వాహనాలను నిలిపి డ్రంక్‌అండ్‌డ్రైవ్ టెస్ట్ చేస్తున్న పోలీసుల చర్యలను ప్రజలు మెచ్చుకుంటున్నా అన్ని వాహనాల డ్రైవర్లను ఎందుకు టెస్ట్ చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు.

కార్లను ఆపే వారేరి?

నెల్లూరు నగరంలో గతంతో పోల్చుకుంటే కార్లు వినియోగించే వారి సంఖ్య అధికమైంది. యువత మద్యం మత్తులో కార్లు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రజలను భయపెడుతున్నారు. కార్లను నిలిపి తనిఖీలు చేయడం, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు చేయాలంటే మనకెందుకులే పలువురు నుంచి సిఫార్సులు, అధికారుల నుంచి చివాట్లు అనుకుంటున్నారో ఏమో తెలియదు కానీ సివిల్, ట్రాఫిక్ పోలీసులు కార్లను నిలిపి తనిఖీలు చేయడం మానేశారు. ప్రస్తుతం ఎన్నికలకు సంబంధించి స్క్వాడ్ అధికారులు మాత్రం నగదు, మద్యం వంటి వాటిని తరలిస్తున్నారేమో అన్న తనిఖీలు చేస్తున్నారు. మద్యం మత్తులో వేగంగా కార్లు నడపుతున్న వారిని ఎవరైనా ప్రశ్నిస్తే దాడులు చేయడం, బూతులు తిడుతూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారు. కొందరు పోలీసులు రాత్రి పూట కారులను నిలిపి తనిఖీలు చేసినా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేయకుండానే ఎంతో కొంత నగదు పుచ్చుకుని పంపేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

సిటీ బస్సులు, ఆటో డ్రైవర్ల ఇష్టారాజ్యం

ఆటో డ్రైవర్లు, సిటీ బస్సు డ్రైవర్లు మద్యం మత్తులోనే డ్రైవింగ్ చేస్తున్నారు. మద్యం సేవిస్తున్న ఆటో డ్రైవర్లు ఇష్టానుసారంగా ఆటోను అటూ ఇటూ తిప్పుతూ నడపుతూ ఎవరైనా ప్రశ్నిస్తే బూతు పురాణం వినిపిస్తున్నారు. ఇక సిటీ బస్సు డ్రైవర్లు నిత్యం మద్యం మత్తులో ఉంటున్నారని ప్రజలు అంటున్నారు. జిల్లా పోలీసు బాస్ దృష్టి సారించి కార్లు, ఆటోలు, సిటీ బస్సులపై ఆకస్మిక తనిఖీలు చేపట్టి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

వడ్డీ మాఫీకి నేటితో గడువు ముగింపు : కమిషనర్


సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్

నెల్లూరు(సిటీ), మార్చి 30 : ఆస్తి పన్ను బకాయిలున్న వారికి వర్తించే వడ్డీ మాఫీకి ఆదివారంతో గడువు ముగుస్తుందని ఎన్ఎంసీ కమిషనర్ వికాస్‌మర్మత్ పేర్కొన్నారు. శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో రెవెన్యూ విభాగంతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం సాయంత్రంలోగా ఆస్తి, ఇతర పన్నుల బకాయిలు చెల్లించితే ఆ బకాయిలకు సంబంధించిన వడ్డీ రద్దు చేస్తామన్నారు. ఈ విషయాన్ని సచివాలయాల వారీగా ప్రజలకు తెలియచేయాలని చెప్పారు. మొండి బకాయిదారుల నుంచి రావాల్సిన పన్నులను వసూళ్ల చేసేందుకు చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్ల వారీగా ఆర్ఐలకు కేటాయించిన రెవెన్యూ లక్ష్యాలను చేరుకోవాలని సూచించా రు. కాగా నెల్లూరుకు వచ్చిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సుబ్బారెడ్డి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి ఎన్ జయసూర్యలను ఆర్అండ్‌బీ అతిథిగృహంలో కమిషనర్ మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నే ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమంలోనూ పాల్గొన్నారు.

సంక్షేమమే తెలుగుదేశం పార్టీ లక్ష్యం

● మాజీ మంత్రి పొంగూరు నారాయణ


చేనేత సంఘం నాయకులతో టీడీపీ అభ్యర్థి నారాయణ

నెల్లూరు(విద్య), మార్చి 30: ప్రజా సంక్షేమం, అభివృద్ధే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని మాజీ మంత్రి, నెల్లూరు నగర టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని 42వ డివిజన్‌లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వం ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. తాను బారాషహీద్ దర్గాను రూ.20 కోట్లతో సుందరంగా తీర్చిదిద్దానన్నారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

● నగరంలోని 43, 15 డివిజన్‌లలో టీడీపీ నగర ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి బాబుష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేగా నారాయణను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

● రానున్న ఎన్నికల్లో మా నాన్న నారాయణను ఎమ్మెల్యేగా, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని మాజీమంత్రి పొంగూరు నారాయణ కుమార్తె షరిణి కోరారు. నగరంలోని 8వ డివిజన్‌లో ఆమె బాబుష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంల నిర్వహించారు.

నారాయణ, వేమిరెడ్డిలను గెలిపించుకుందాం


కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత కోటంరెడ్డి

నెల్లూరు (వ్యవసాయం) : నెల్లూరు నగరంలో అభివృద్ధి జరగాలంటే ఎమ్మెల్యే గా పొంగూరు నారాయణ, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించుకుం దామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. శనివారం 3వ డివిజన్ వేణుగోపాలనగర్ ప్రాంతంలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శైలజ, గోవర్థన్, శ్రీలక్ష్మి, శోభ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : నెల్లూరు నగర నియోజకవర్గ జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి, మాజీ మంత్రి పొంగూరు నారాయణను గోమతినగర్‌లోని ఆయన క్యాంప్ కార్యాల యంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గజరాజు శాంతికల, హైమావతి, ప్రశాంత్‌గౌడ్, హేమచంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చేనేతలను ఆదుకుంది టీడీపీనే.

నెల్లూరు(సిటీ) : చేనేత కార్మికులను ఆదుకున్నది తమ ప్రభుత్వమేనని నెల్లూరు సిటీ టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ అన్నారు. శనివారం 4వ డివిజన్‌లో పద్మాశాలి సంఘం నాయకులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. చేనేతలకు స్కిల్ డవలప్‌మెంట్ సెంటరు ఏర్పాటు చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. గాంధీనగర్‌లోని ఆప్కో స్థలం చేనేత ప్రయోజనాల కోసం ఉపయోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునగపాటి రమేష్, శ్రీనివాసులు, పెంచలయ్య, నారాయణ విద్యా సంస్థల ఏజీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ నగర అధ్యక్షుడు మధు, మాజీ ఎమ్మెల్సీ రాధయ్య పాల్గొన్నారు.

నెల్లూరు(వెంకటేశ్వరపురం) : గెలిపించాలని టీడీపీ నేత కేతంరెడ్డి వినోద్‌రెడ్డి నగరంలోని 54వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నగర ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణనుగెలిపించాలని ఇంటింటి ప్రచారం చేశారు.

కోటంరెడ్డి కుటుంబ సభ్యుల ఇంటింటి ప్రచారం

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 30 : నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 41వ డివిజన్ శివగిరికాలనీ, ఫుత్తాఎస్టేట్, పరమేశ్వరినగర్, ఇరగాళ్లమ్మ సంఘం, మనుమసిద్ధినగర్ ప్రాంతాల్లో టీడీపీ రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమని సుజితమ్మ, కుమార్తెలు హైందవి, వైష్ణవి, తాళ్లపాక రమేష్‌రెడ్డి కుమార్తె తారకారెడ్డిలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా శ్రీధర్‌రెడ్డిలకు మద్దతు ఇవ్వాలని కోరారు.

● **టీడీపీలో చేరికలు**

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 28వ డివిజన్ శాంతినగర్‌కు చెందిన మాధవి, ఉమాదేవి, అనిత, వెంగమ్మ, రాజేశ్వరిలు రూరల్ టీడీపీ కార్యాలయంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్డపనేని రాజా, సాయిసునీల్, వెంటేశ్వర్లునాయుడు, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), మార్చి 30 : నెల్లూరు నగరం కొత్తూరులోని కేంద్రీయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి 1వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తరగతిలో 64 సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఆర్టీఏ చట్టం కింద 16 సీట్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్స్ కింద కేటాయిస్తామని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు కేవీఎస్‌ఆన్‌లైన్‌అడ్మిషన్స్ డాట్స్ కేవీఎస్ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో ఏప్రిల్ 15వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు కొత్తూరు డాట్ కేవీఎస్ డాట్ ఏసీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర సదస్సును అడ్డుకోవడం దుర్మార్గపు చర్య


నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 30 : గుంటూరులో ఎంఆర్‌పీఎస్ తలపెట్టిన రాష్ట్ర సదస్సును రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవడం దుర్మార్గపు చర్య అని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయకృష్ణ మాదిగ ఖండించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి సూరిపాక వాసుదేవ రావు మాదిగ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం పెత్తనం చెలాయించడం ఏమిటో తెలియడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేద్కర్‌మాదిగ, ఎంఎస్‌పీ జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్‌మాదిగ, జిల్లా గౌరవాధ్యక్షుడు తాటిపర్తి లక్ష్మయ్య పాల్గొన్నారు.

త్యాగరాజ స్మరణోత్సవాల ప్రారంభం




నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 30 : నగరంలోని పురమందిరంలో శనివారం 59వ త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సీతారామ లక్ష్మణ, త్యాగరాజ స్వామి విగ్రహాలకు విశేష పూజలు చేసి ఊరేగింపుగా తీసుకువచ్చి సభా ప్రాంగణంలో శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. ఉదయం భాగవతార్ పరాయణం, మధ్యాహ్నం భక్తమార్కండేయ చరిత్ర హరికథ, సాయంత్రం పంచరత్న ఘోష్టి, తదితర కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ గాయని ఎస్‌పీ శైలజ, జ్యోతి, ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమాలను శ్రీభరద్వాజ రుద్రాభిషేక సంఘం, భిక్షాటన పూర్వక శ్రీత్యాగరాజస్మరణోత్సవ సభ కమిటీలు పర్యవేక్షించారు.

మైనార్టీ నేతలతో అజీజ్ సమావేశం


మైనార్టీ నేతలతో సమీక్షిస్తున్న అజీజ్

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 30 : పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నగరంలోని పలు ప్రాంతాల్లో ఇఫ్తార్ విందుకు సంబంధించి టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ శనివారం నగర మైనార్టీ నేతలతో సమావేశం నిర్వహిం చారు. ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయాల్సిన ప్రదేశాలు, అక్కడి ఏర్పాట్లపై నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో నాయకులు జాఫర్, షరీఫ్, ఖైనుద్దీన్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.





నాయుడుపేట సభకు హాజరైన జనసమూహం

ప్రజాగళం... పోటెత్తిన జనం

మధుకు ఓటేస్తే మీ ఇళ్లు కూడా మిగల్చడు

"శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డికి మళ్లీ ఓటేస్తే మీ ఇళ్ళూ, భూములూ మిగలవు. నేను తెచ్చిన పరిశ్రమలను ఆయన ఏటీఎంగా మార్చుకుంటున్నాడు. ల్యాంకోను వేధించి కప్పం కట్టలేదని పదిహేను రోజులు మూతబడేలా చేశాడు. మధుసూదనరెడ్డి లాంటి దుర్మార్గుడ్ని నేనెక్కడా చూడలేదు. కమీషన్లు, కబ్జాలు, రౌడీయిజం, గూండాయిజం, శాండ్ మాఫియా,ల్యాండ్ మాఫియాలకు శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని అడ్డాగా మార్చేశాడు. 210 ఎకరాల ప్రభుత్వ భూములు కాజేశాడు. ఎమ్మెల్యే కుటుంబంలో కూతురు, బావమరిది, కొడుకు, తమ్ముడు నియోజకవర్గాన్ని ముక్కలు చేసుకుని వాటాలు వేసుకుని పంచుకు తింటున్నారు. రాజీవ్‌నగర్‌లో పేదల ఇళ్ళ స్థలాలను ఎమ్మెల్యే అనుచరులతో కబ్జా చేయించాడు. శ్రీకాళహస్తిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎదురుగా రూ. కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాజేశాడు. చివరికి శ్రీకాళహస్తి డంపింగ్ యార్డునూ కబ్జా చేశారు. బోగస్ పట్టాలతో అందరినీ ప్రలోభ పెడుతున్నాడు. దానిపై విచారణ జరిపించి బాధ్యులను జైలుకు పంపుతాం. అవినీతికి పాల్పడిన వారికి బేడీలు వేసి ఊరేగిస్తాం. అహంకారి, విధ్వంసపరుడు, దుర్మార్గుడైన ఎమ్మెల్యే మధుసూదనరెడ్డిని చిత్తుచిత్తుగా ఓడించండి."



వేదికపై చంద్రబాబుతో వాకాటి, ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు

పెద్దిరెడ్డి బినామీ కిలివేటి

"సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మంత్రి పెద్దిరెడ్డికి బినామీగా వ్యవహరిస్తున్నాడు. స్వర్ణముఖి, కాళంగి నదుల్లో ఇసుక తవ్వకాలకు ఎమ్మెల్యేని పెద్దిరెడ్డి పావుగా వాడుకుంటున్నాడు. సూళ్ళూరుపేట నియోజకవర్గాన్ని గంజాయి, లిక్కర్, బెట్టింగ్, గ్రావెల్, రేషన్ బియ్యం అక్రమ దందాలకు కేరాఫ్‌గా మార్చేశారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా కనీసం తట్ట మట్టి కూడా పోయలేదు. ఏమి చేశారని ప్రజలు మూడోసారి ఓట్లు వేస్తారు?"

"ఎస్సీ, మైనారిటీ ఎమ్మెల్యేలకు టికెట్లు మార్చిన జగన్, తన సామాజికవర్గానికి చెందిన పెద్దిరెడ్డికి ఎందుకు మార్చలేదు? చెవిరెడ్డికి ఎంపీ టికెట్, కొడుక్కు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చి డబుల్ ప్రమోషన్ మాత్రం ఎలా ఇచ్చాడు?"

"సీఎంగా వున్నపుడు ఎర్ర చందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపా. ఇపుడు వైసీపీలో ఏకంగా ఎర్రచందనం స్మగ్లర్‌కు చిత్తూరు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు."

తిరుపతి, శ్రీకాళహస్తి, నెల్లూరులను కలుపుతూ

ట్రై సిటీ

- పర్యాటక హబ్‌గా కాణిపాకం, తిరుపతి, శ్రీకాళహస్తి
- శ్రీకాళహస్తి, నాయుడుపేట సభల్లో చంద్రబాబు ప్రకటన
- భారీ జనసందోహాన్ని ఉద్దేశించి ఉద్వేగంగా ప్రసంగాలు
- వైసీపీ ఎమ్మెల్యేల అవినీతి చిట్టా విప్పి హెచ్చరికలు

శ్రీకాళహస్తి/నాయుడుపేట, మార్చి 30: తిరుపతి, శ్రీకాళహస్తి, నెల్లూరులను కలుపుతూ ట్రైసిటీగా అభివృద్ధి చేయాలన్నది తన కల అని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. శనివారం నాయుడుపేట, శ్రీకాళహస్తి పట్టణాల్లో జరిగిన ప్రజాగళం సభల్లో తిరుపతి జిల్లా అభివృద్ధికి తాను చేయదలచుకున్న అనేక అంశాలను ప్రజలకు తెలియజేశారు. టీడీపీ పాలనలో తాను చేసిన అభివృద్ధి పనులనూ, తరువాత జగన్ చేసిన విధ్వంసాన్నీ వివరించారు. వెల్లువెత్తినట్టుగా హాజరైన ప్రజలను చూసి చంద్రబాబు ఉత్సాహంగా ఉద్వేగంగా ప్రసంగించారు. సీఎం జగన్ మొదలుకుని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట ఎమ్మెల్యేలపై ఆరోపణలు, హెచ్చరికలతో చంద్రబాబు రౌద్రావతారం దాల్చారు.

ప్రజాగళం సభలకు అంచనాలకు మించి పార్టీ శ్రేణులు, ప్రజలు హాజరవడంతో టీడీపీ అధినేత చంద్రబాబే సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. నాయుడుపేట సభ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కావాల్సి వుండగా సూళ్ళూరుపేట నియోజకవర్గవ్యాప్తంగా కార్యకర్తలు, నాయకులు, సామాన్య జనం ఉదయానికే నాయుడుపేటకు చేరుకున్నారు.ఎండ, వేడిమి కారణంగా ఎక్కడ నీడ, చాటు దొరికితే అక్కడల్లా తలదాచుకుని అధినేత రాక కోసం ఓపికగా నిరీక్షించారు. మధ్యాహ్నం ఎండ మండిపోతున్నా లెక్క చేయకుండా బహిరంగ సభలో పాల్గొని చంద్రబాబు ప్రసంగానికి జేజేలు కొట్టారు. అక్కడ నియోజకవర్గ నేతలు వేసుకున్న అంచనాలకు మించి జనం హాజరయ్యారు. ఇక శ్రీకాళహస్తిలో సాయంత్రం 5 గంటలకు సభ ప్రారంభమవుతుందని తెలిసినా పార్టీ శ్రేణులు, ప్రజలు మధ్యాహ్నం నుంచే బేరివారి మండపం కూడలి ప్రాంతానికి చేరుకున్నారు. హెలిపాడ్ వద్ద కూడా చంద్రబాబుకు భారీ స్వాగతం పలికారు. చంద్రబాబు ఆగమనానికి సూచికగా భారీ ఎత్తున బాణాసంచా పేల్చడంతో స్థానికులు పెద్ద సంఖ్యలో సభా కూడలి వద్దకు పరుగులు పెట్టారు. శ్రీకాళహస్తిలో అయితే పార్టీ నేతలు వేసుకున్న అంచనాలకు కొన్ని రెట్లు అధికంగా జనం విరగబడడంతో చంద్రబాబు సైతం సంతోషం పట్టలేకపోయారు. తన ప్రసంగంలో ప్రత్యేకంగా ఈ అంశాన్ని ప్రస్తావించారు. శ్రీకాళహస్తిలో ఇంత జనం హాజరైన సభను చూడలేదన్నారు. ఎంతో సంతోషంతో, మనస్తృప్తితో వెళుతున్నానని ఆయన చెప్పడమే సభ ఎంతగా విజయవంతమైంది అనడానికి నిదర్శనం. దానికి తోడు చంద్రబాబు ప్రసంగానికి జనం నుంచీ అనూహ్య స్పందన కనిపించింది. స్థానిక ఎమ్మెల్యేపై ఆరోపణలు చేసినపుడు, అవినీతిపరులను బేడీలు వేసి ఊరేగిస్తామని హెచ్చరికలు చేసినపుడు జనం కేరింతలు కొట్టారు. మొత్తానికీ రెండు చోట్లా చంద్రబాబు పాల్గొన్న బహిరంగసభలు విజయవంతం కావడంతో స్థానిక పార్టీ నాయకుల సంతోషానికి పట్టపగ్గాల్లేకుండా పోయాయి.

తిరుపతి కేంద్రంగా పిలిగ్రిమ్ హబ్

కాణిపాకం, తిరుపతి, శ్రీకాళహస్తిలను కలుపుతూ పిలిగ్రిమ్ హబ్‌గా మారుస్తానని చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వంలో తాను జిల్లాలో రూ. వందల కోట్లు ఖర్చు చేసి ఇరిగేషన్ ప్రాజెక్టులు అభివృద్ధి చేశానని, అయితే తర్వాత అధికారంలోకి వచ్చిన సైకో జగన్ పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. సోమశిల-స్వర్ణముఖి కెనాల్, గాలేరు నగరి పనులు తాము ప్రారంభించామని, జగన్ పూర్తిగా గాలికొదిలేశాడన్నారు. తాము అధికారంలోకి రాగానే ఎస్ఎస్ కెనాల్ పనులు పూర్తిచేసి శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని అన్ని చెరువులకూ నీటిని అందించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు.

మత్స్యకారులకు డీజల్, వలలు

టీడీపీ అధికారంలోకి రాగానే మత్స్యకారులను ఆదుకుంటామని నాయుడుపేట బహిరంగసభలో చంద్రబాబు హామీ ఇచ్చారు. పులికాట్ సరస్సులో పూడిక పేరుకుపోవడం, తమిళనాడు జాలర్లతో సరిహద్దు తగాదాలు వంటి సమస్యలు సుదీర్ఘకాలంగా వున్నాయన్నారు. అధికారంలోకి రాగానే వీటికి శాశ్వత పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. సబ్సిడీపై డీజిల్, వలలు ఇస్తామన్నారు. సూళ్ళూరుపేట ప్రాంతంలో వుండేవారు తమిళనాడు సరిహద్దులకు వెళ్ళి పెట్రోలు, డీజిల్ కొనుగోలు చేస్తున్నారని, దీని వల్ల ఆదాయం తమిళనాడుకు పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు.టీడీపీ ప్రభుత్వం ఏర్పడగానే ఈ ప్రాంతానికి పెట్టుబడులు రప్పించి, స్థానిక యువతకు ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానన్నారు.

ఉన్న పరిశ్రమలూ తరిమేశారు

తాను తిరుపతి విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా తెచ్చానని, ఈ ప్రాంతానికి హీరో మోటర్స్, సెల్‌కాన్, ఈసీఎల్, కార్బన్, డిక్సన్ కంపెనీలు తీసుకొచ్చి పారిశ్రామిక హబ్‌గా మార్చానని చంద్రబాబు చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్న వాటినీ తరిమేస్తున్నారని ఆరోపించారు. రిలయన్స్ సంస్థ పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోగా, అమరరాజా పరిశ్రమ విస్తరణ ప్లాంటును తెలంగాణకు తరలించడాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

గోపాల్ జ్ఞాపకాలు..

నిజాయితీతో కూడిన రాజకీయాలకు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి నిలువెత్తు నిదర్శనమని చంద్రబాబు కొనియాడారు. తనకూ గోపాలకృష్ణారెడ్డికి 40 ఏళ్ళ స్నేహం వుందన్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తామిద్దరూ కలసి వెళుతుంటే అలిపిరి వద్ద తీవ్రవాదులు క్లైమోర్ మైన్స్ పేల్చిన ఘటనను ఆయన గుర్తు చేసుకున్నారు. అప్పట్లో తమ అవసరం ప్రజలకు వుందని భావించడం వల్లే వెంకటేశ్వరస్వామి తమను కాపాడాడన్నారు. శ్రీకాళహస్తి ప్రజల గుండెల్లో గోపాలకృష్ణారెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు.

శివ శివా..

రేణిగుంట పూర్వ తహసీల్దారు శివప్రసాద్‌పై ఫిర్యాదులెన్నో

- ప్రభుత్వ భూముల పరాధీనం ● తీవ్ర అవినీతి ఆరోపణలు ● ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్ తనిఖీలు

తిరుపతి, ఆంధ్రజ్యోతి / రేణిగుంట: తిరుపతి, శ్రీకాళహస్తి పరిసరాల్లో అత్యంత విలువైన ప్రభుత్వ భూములు పరాధీనం చేయడం.. తీవ్ర అవినీతి ఆరోపణల నేపథ్యంలోనే రేణిగుంట పూర్వ తహసీల్దారు శివప్రసాద్‌పై ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్ దృష్టి సారించింది. ఇన్నాళ్ల ఏసీబీకి ఫిర్యాదులు వెళ్లినా.. ఓ అధికారితో ఇతడికి ఉన్న దోస్తీ కారణంగా బుట్టదాఖలా అవుతున్నాయని సమాచారం. దీంతో బాధితులు నేరుగా ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయడం వల్లే శనివారం ఆ అధికారితో పాటు బంధువులు, బినామీల ఇళ్లల్లో ఏకకాలంలో తొమ్మిది చోట్ల ఏసీబీ సీఐయూ బృందాలు తనిఖీలు చేపట్టాయి.

తండ్రి మరణంతో కారుణ్య నియామకం కింద జూనియర్ అసిస్టెంట్‌గా చేరిన శివప్రసాద్.. స్వల్ప కాలంలోనే రూ.కోట్లకు పడగలెత్తారని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. ఆర్ఐగా పదోన్నతిపై తిరుపతి ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వచ్చిన ఆయన.. ఓ ఆర్డీవో సహకారంతో ప్రొటోకాల్ డీటీగా వ్యవహరించారని తెలిసింది. ఆ సమయంలోనే ఉన్నత స్థాయి వ్యక్తులతో పరిచయాలు పెంచుకున్నట్లు సమాచారం. ఆ తర్వాత తిరుపతి రూరల్ తహసీల్దారు కార్యాలయలో సీనియర్ అసిస్టెంట్‌గా, అర్బన్ తహసీల్దారు కార్యాలయంలో ప్రొటోకాల్ డీటీగా పనిచేశారు. ఆయా సందర్భాలలో ఉన్నతాధికారులతో పెరిగిన పరిచయాలతో రేణిగుంట డీటీగా బదిలీ అయి.. అక్కడే పాతుకుపోయారు. అక్కడ తహసీల్దారును డమ్మీని చేసి డీటీగా ఉన్న శివప్రసాదే అధికారం చెలాయించారన్న విమర్శలున్నాయి. విమానాశ్రయం ఆనుకుని ఉన్న పాతిక ఎకరాల ప్రభుత్వ భూమికి వైసీపీకి చెందిన ముఖ్య ప్రజాప్రతినిధి అండతో ఇతరుల పేరిట పట్టాలు జారీ చేశారని.. దానికోసం ఎకరాకు రూ.20 లక్షల నుంచీ రూ.30 లక్షల దాకా వసూలు చేసినట్టు ఆరోపణలున్నాయి. ఆ తర్వాత తహసీల్దారుగా పదోన్నతి రావడంతో రేణిగుంటలోనే కొనసాగారు. ఆ సమయంలో రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ బంజరు, పోరంబోకు, అనాధీనం భూములను అనర్హులకు కట్టబెట్టడం, అధికార పార్టీ ముఖ్యనేత కబ్జాలకు సహకరించారన్న ఆరోపణలున్నాయి. తిరుపతి రూరల్, అర్బన్, రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో చెరువులు, కాలువలకు కూడా ఎన్‌వోసీలు జారీ కావడం.. ప్రభుత్వ భూముల పరాధీనం, భూముల సెటిల్‌మెంట్లతో అక్రమార్జన వందల కోట్లకు చేరుకుందని సహోద్యోగులే చెబుతున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆదివారం) : సా. 6.27
సహరి (సోమవారం) : ఉ. 4.50

కలెక్టర్‌కు సరెండర్ చేసినా..!

గతంలో ఇతడిపై వచ్చిన ఆరోపణలపై ఓ కలెక్టర్ విచారణ జరిపించి 40 అంశాలను నిర్ధారిస్తూ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని సమాచారం. ఇటీవల సీసీఎల్ఏ కూడా పలు అంశాల్లో ఇతడిని బాధ్యుడిగా గుర్తించి రేణిగుంట నుంచి కలెక్టర్‌కు సరెండర్ చేసిన సంగతి తెలిసిందే. తీవ్రస్థాయి రాజకీయ ఒత్తిళ్లతో ఇతడిని కలెక్టరేట్‌లో కాకుండా ఏర్పేడు మండలానికి బదిలీ చేశారు. అక్రమార్జన.. నేతల అండ చూసుకుని కలెక్టర్లను కూడా ఖాతరు చేసేవారు కాదన్న ప్రచారం ఉంది. ప్రభుత్వానికి ఎన్ని నివేదికలు ఇచ్చినా, చర్యలకు సిఫారసు చేసినా డబ్బు, పలుకుబడితో అధిగమించేవారని చెబుతున్నారు. గతంలోనూ ఏసీబీకి పలు ఫిర్యాదులు వెళ్లినా.. ఓ అధికారితో స్నేహం వల్ల తనిఖీలు, దాడులు జరగకుండా జాగ్రత్త వహించేవారని అంటున్నారు. సంబంధిత ఏసీబీ అధికారితో కలసి బెంగళూరు వంటి నగరాల్లో భారీ పెట్టుబడులు కూడా పెట్టినట్టు ఆరోపణలున్నాయి.

రంగంలోకి ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్

తాజాగా శివప్రసాద్‌పై రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు రావడంతో ఏసీబీకి కాకుండా ఆ విభాగంలోని సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్‌కు విచారణ బాధ్యతలు అప్పగించినట్టు తెలిసింది. విజయవాడ నుంచే మొత్తం 42 మందితో కూడిన బృందాలు ఏకకాలంలో దాడులు జరిగాయి. కాగా, తనకు స్నేహమున్న ఏసీబీ అధికారి సూచన మేరకు మొత్తం అక్రమార్జనంతా బినామీల పేరిట పెట్టినట్టు చెబుతున్నారు. ఇప్పటికే గుర్తించిన పలువురు బినామీల బ్యాంకు ఖాతాలు, లాకర్లను తనిఖీ చేయనున్నట్టు సమాచారం. ఇంతకాలం అధికార పార్టీకి చెందిన ముఖ్య నేతలు ఇతడిని వెనకేసుకొచ్చి, అన్నింటికీ అండదండలిచ్చిన క్రమంలో ఈ దాడులు అందరినీ విస్మయానికి గురి చేస్తున్నాయి. బహుశా, శ్రీకాళహస్తి ప్రాంతానికి చెందిన నేతకు తెలియకుండా విలువైన భూముల విషయంలో ఎవరికైనా సహకరించి భారీగా లబ్ధి పొంది ఉంటారని, ఉంటారని, అది ఆలస్యంగా తెలియడం వల్లే ఆ నేతే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఈ చర్యలకు కారకులై ఉంటారన్న ప్రచారం జరుగుతోంది. గతంలో పలువురు అధికారులను వేధించిన చరిత్ర ఆ నేతకు ఉండటంతో దీన్ని కొట్టిపారేయలేమంటున్నారు. కారణాలేవైనా ఎప్పుడో జరగాల్సిన ఏసీబీ తనిఖీలు, చర్యలు ఆలస్యంగానైనా మొదలు కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బంగారుపాళ్యంలో ఏసీబీ తనిఖీలు



బంగారుపాళ్యం మండలం గుర్రంకొండ్లవూరులోని తహసీల్దారు శివప్రసాద్ మామ నాగులయ్య ఇంట్లో శనివారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. పలు రికార్డులు, బ్యాంకు పుస్తకాలు, భూ రికార్డులను పరిశీలించారు. బ్యాంకు పుస్తకాన్ని తీసుకెళ్లినట్టు సమాచారం. - బంగారుపాళ్యం

ఆత్మీయ సమావేశం పేరుతో

వైసీపీ విందు రాజకీయం

అడ్డుకొన్న ఎన్నికల నిఘా అధికారులు

పుట్టినరోజు వేడుకలంటూ కేక్ కట్‌చేసిన ఎమ్మెల్యే



వైసీపీ నాయకుల నడుమ కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి

సూళ్లూరుపేట, మార్చి 30: సూళ్లూరుపేటలో ఆత్మీయ సమావేశం పేరుతో వైసీపీ విందు రాజకీయానికి తెరలేపింది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు కూడా చేశారు. విషయం తెలుసుకొన్న ఎన్నికల నిఘా బృందం అధికారులు అడ్డుకోవడంతో పుట్టిన రోజు వేడుకలంటూ ఎమ్మెల్యే కిలివేటి కేక్ కట్‌చేసి వెళ్లిపోయారు. పట్టణంలోని వ్యాపార వర్గాలతో ఆత్మీయ సమావేశం నిర్వహించేందుకు శనివారం రాత్రి ఓ కల్యాణ మండపంలో వైసీపీ నేతలు ఏర్పాట్లు చేశారు. దీనికి పట్టణంలో అన్ని వ్యాపార వర్గాలకు చెందిన వారందరూ విచ్చేశారు. సమావేశంలో పాల్గొని ఎమ్మెల్యేతో కలిసి విందు భోజనం చేసేందుకు అధికార పార్టీ నాయకులు కూడా వచ్చారు. ఇంతలో ఎన్నికల నిఘా అధికారుల బృందం అక్కడకు చేరుకొని ఆత్మీయ సమావేశాలు నిర్వహించకూడదని అడ్డుకొన్నారు. ఈ విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే కిలివేటి రాత్రి 10గంటల వరకు ఆత్మీయ సమావేశానికి రాలేదు. అధికారులు అక్కడ నుంచి కదలకపోవడంతో రాజకీయ సమావేశం కాదని వ్యాపారస్తులందరూ కార్యక్రమం నిర్వహించుకొంటున్నామని అక్కడున్న అధికార పార్టీ నాయకులు చెప్పారు. వచ్చిన వారందరూ భోజనాలు చేసి వెళ్లిపోయారు. రాత్రి 10 గంటలకు అక్కడకు చేరుకొన్న ఎమ్మెల్యే ఇది పార్టీ కార్యక్రమం కాదని, తెలిసినవారు పుట్టిన రోజు వేడుకలకు పిలిస్తే వచ్చామని అధికారులకు తెలిపారు. అనంతరం కేక్‌కట్ చేసి వెళ్లిపోయారు. అనంతరం అధికారులు కూడా అక్కడ నుంచి వెనుదిరిగారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతిపాలు: పాశం



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 30: వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతిపాలైందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక 4వ వార్డులో పలువురు టీడీపీలోకి చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కచాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అరాచక పాలన సాగించిందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. దోచుకోవడమే పనిగా పాలన సాగించి, అవినీతిని ప్రశ్నించే వారిపై దౌర్జన్యాలకు దిగిందని ధ్వజమెత్తారు. మద్యపాన నిషేధం అమలు చేస్తామని చెప్పి, నాశిరకం మద్యం విక్రయించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని ఆరోపించారు. గాడి తప్పిన రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించాలంటే చంద్రబాబునాయుడుకే సాధ్యమవుతుందన్నారు. పేదలకు అభివృద్ధి, సంక్షేమం అందాలంటే రానున్న ఎన్నికల్లో ఉమ్మడి ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, నరసింహుల నాయుడు, చంద్రమౌళి, మోహన్, శ్రీధర్, చంటి, కాలేషా, కడియాల వెంకటేశ్వర్లు, రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణంతీసిన ఈత సరదా

చెరువులో మునిగి వివాహిత మృతి



నాగరాణి మృతదేహం

వరదయ్యపాళెం, మార్చి 30: కుటుంబసభ్యులతో సరదాగా ఈత కొట్టేందుకు చెరువులో దిగిన ఓ గిరిజన వివాహిత నీట మునిగి మృతి చెందింది. ఈ ఘటన వరదయ్యపాళెంలో శుక్రవారం చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి మండలం తెట్టు అరుంధతివాడకు చెందిన పవన్, నాగరాణి(40)దంపతులు ప్లాస్టిక్ వస్తువులు, కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగించేవారు. వీరికి నలుగురు సంతానం. సంచారవృత్తి రీత్యా వరదయ్యపాళెం గిరిజనకాలనీలో నివాసం ఉంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం పిల్లలు, బంధువులతో సహా కాలనీ సమీపంలోని అర్దూరు చెరువులో ఈతకు వెళ్లారు. కొంతసేపటి తరువాత పిల్లలు, బంధువులు ఇంటికి వెళ్లగా పవన్, నాగరాణి చెరువులోనే కొంతసమయం గడిపారు. తర్వాత పవన్ దుస్తులు ఆరబెట్టడానికి గట్టుకు చేరాడు. ఆ సమయంలో నాగరాణి బురదలో చిక్కుకుని నీట మునిగిపోయింది. పవన్‌కు ఈత రాకపోవడంతో కాలనీకి వెళ్లి బంధువులను తీసుకొచ్చేసరికి ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, అంత్యక్రియలు ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఏఎస్‌ఐ షణ్ముగం తన వంతు సాయం అందించారు.

పోలేరమ్మ జాతరకు తాంబూలం అందజేత



పెద్దకాపు శ్రీనివాసులురెడ్డికి తాంబూలం అందజేస్తున్న ఈవో శశాంక్

నాయుడుపేట టౌన్, మార్చి 30: పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ జాతరకు తాంబూలం అందజేశారు. శనివారం మండలంలోని విన్నమాల గ్రామంలో ఉన్న పెద్దకాపు అరవభూమి శ్రీనివాసులు రెడ్డికి జాతర తేదీని తెలియజేస్తూ దేవదాయశాఖ ఈవో శశాంక్ తాంబుళం అందజేశారు. ఏప్రిల్ 2న జాతరకు చాటింపు వేస్తామని, మే 28, 29 తేదీల్లో జాతర నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కుబేరు మణి, శేషగిరి, రామారావు, అంజయ్య, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

నాయుడుపేట టౌన్, మార్చి 30: మహిళ మెడలో బంగారు గొలుసు అపహరించుకుపోయిన ఘటన నాయుడుపేట పట్టణంలోని మునిరత్నం నగర్ కాలనీ సమీపంలో జరిగింది. బాధితుల కథనం మేరకు లక్ష్మీపతి, విజయలక్ష్మి దంపతులు పట్టణంలోని టీ దుకాణం నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి దుకాణాన్ని మూసివేసి భార్య, భర్తలిద్దరూ మోటారు సైకిల్‌పై తాము నివాసముండే మునిరత్నం కాలనీకి బయలుదేరారు. కాలనీ దగ్గరకు వెళ్లగానే ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వచ్చి విజయలక్ష్మి మెడలో ఉన్న మూడు సవర్ల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనొద్దు

కోట, మార్చి 30: రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనవద్దని తహసీల్దారు నాగరాజరావు అన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికల నియమావళిపై రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లపై నిఘా ఉంటుందని, నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

కోట, మార్చి 30: కోట నుంచి గూడలిలోని బెల్టు దుకాణానికి తరలిస్తున్న 30 మద్యం బాటిళ్లను ఎస్‌ఐ నాగబాబు స్వాధీనం శనివారం చేసుకున్నారు. నిందితుడు ప్రవీణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో చోరీ

దొరవారిసత్రం, మార్చి 30: దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డిపాళెం వద్ద ఉన్న భారత్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. కార్యాలయ తలుపులు పగలకొట్టి మూడు కంప్యూటర్లు, రెండు ప్రింటర్లు, రూ.42వేల నగదు ఎత్తుకెళ్లినట్లు ఏజెన్సీ నిర్వాహకుడు సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు చోరీ

దొరవారిసత్రం, మార్చి 30: మండలంలోని మేలుపాక గ్రామం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు, ఆయిల్‌ను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ట్రాన్స్‌కో ఏఈ జగదీష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మత్స్యకారులను ఆదుకుంటాం: చంద్రబాబు



ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు, ప్రసంగిస్తున్న విజయశ్రీ

నాయుడుపేట/తడ, మార్చి 30: పులికాట్ సరస్సును నమ్ముకొని ఉన్న మత్స్యకారులను అన్ని విధాలుగా ఆదుకుంటామని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. శనివారం సాయంత్రం నాయుడుపేట పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన ప్రజాగళం బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పులికాట్ ముఖద్వారాల వద్ద పూడికతీయించి మత్స్య సంపద సంవృద్ధిగా దొరికేలా కృషి చేస్తామన్నారు. అంతేకాకుండా వలలు, సబ్సిడీ డీజిల్ వంటి పథకాలను చేరువ చేస్తామని చెప్పారు. స్వర్ణముఖి, కాళంగి నదుల ఇసుక ఎమ్మెల్యే కిలివేటికి ఏటీఎంగా మారిందన్నారు. ఇసుకంతా దోచేసినా చాలక గంజాయి, గ్రావెల్ దందా, అక్రమ బియ్యం, లిక్కర్ దందాల్లోనూ ఎమ్మెల్యే భాగస్తుడుగా మారారని దుయ్యబట్టారు. శ్రీసిటీ సెజ్‌కు తాను పరిశ్రమలు తెస్తే... కిలివేటి సంజీవయ్య పేకాట క్లబ్‌లు తెచ్చారని విమర్శించారు. ఆయన అవినీతితో ఇసుక మొత్తం మాయమై భూగర్భజలాలు అడుగంటిపోయాయని, నేడు తాగడానికి మంచినీళ్ల సైతం లేక మీరు ఇబ్బందులు పడుతున్నది నిజమే కదా అని ప్రజలనుద్దేశించి అన్నారు. ఈ పదేళ్లల్లో ఒక్క చిన్న అభివృద్ధి పని అయినా మీ ఎమ్మెల్యే చేశాడా అని స్థానికులను ప్రశ్నించారు. చెత్త మీద పన్నువేసిన ఈ ముఖ్యమంత్రికి ప్రజలు గుణపాఠం చెప్పాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. చంద్రబాబు వెంట సూళ్లూరుపేట, గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థులు నెలవల విజయశ్రీ, పాశం సునీల్‌కుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి పరసారత్నం, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, జనసేన నాయకుడు ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, వేనాటి సతీష్‌రెడ్డి, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, కందల కృష్ణారెడ్డి, రఫీ తదితరులు ఉన్నారు.

చంద్రబాబుకు ఘనస్వాగతం



హెలిప్యాడ్ వద్ద చంద్రబాబు కోసం ఎదురుచూస్తున్న టీడీపీ నాయకులు

నాయుడుపేట/టౌన్, మార్చి 30: ప్రజాగళం బహిరంగ సభకు విచ్చేసిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. హెలిప్యాడ్ వద్ద ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం. మాజీ మంత్రి పరసారత్నం, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు కామిరెడ్డి అశోక్‌రెడ్డి, తెలుగు యువత కార్యదర్శి శోభన్‌నాయుడు, డాక్టర్ సందీప్ తదితరులు స్వాగతం పలికారు.

ప్రజాగళం విజయవంతం

నాయుడుపేట/తడ, మార్చి 30: నాయుడుపేట పట్టణంలో శనివారం ప్రజాగళం సభ విజయవంతమైంది. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రసంగం కార్యకర్తలు, ప్రజలను ఉత్సాహపరిచింది. తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రూ.60 ఉన్న మద్యం బాటిల్ ప్రస్తుత ధర రూ.200 కదా తమ్ముళ్లూ అని చంద్రబాబు ప్రశ్నించగా జనం ఔను అంటూ చేతులు ఊపారు. ఈ సైకో ప్రభుత్వం మనకు అవసరమా అన్న మాటకూ జనం విపరీతంగా స్పందించారు. ఇలా పలుమార్లు జనంతో ఆయన సమాధానాలు చెప్పించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. సాయంత్రం 4.10 నిమిషాలకు ప్రసంగం మొదలుపెట్టిన చంద్రబాబు గంటపాటు ఏకధాటిగా ప్రసంగిస్తూ సభికులను ఉర్రూతలూగించారు.









చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు: కురుగొండ్ల



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

బాలాయపల్లి, మార్చి 30: చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని బైరవరం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ దూరదృష్టితో ఆలోచించే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనతో రాష్ట్రం ఇరవై ఏళ్ల వెనక్కి వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తన కుమార్తె, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీసాయిప్రియను గెలిపించాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి అన్నివర్గాలకు లబ్ధి చేకూర్చడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా బైరవరం గ్రామానికి చెందిన వైసీపీ నేత దాసరి మురగయ్య ఆధ్వర్యంలో 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి కురుగొండ్ల రామకృష్ణ పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాయి సత్యం నాయుడు, కూను శ్రీహరి, సీసీ నాయుడు, నల్లబోతుల మురళి, సాగి నరసింహులు నాయుడు, మారెళ్ల వెంకటాద్రి, గోపాల్ యాదవ్, శేఖర్, మద్దూరు కృష్ణ, దాసరి కోటేశ్వరావు, జడపల్లి కోటేశ్వరావు, తాళ్ల వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిలో ప్రచారం

వెంకటగిరి, మార్చి 31: పట్టణంలోని 5వ వార్డు కాలేజీ మిట్టలో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రచారం నిర్వహించారు. తన కుమార్తె కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియను గెలిపించాలని ఓటర్లను కోరారు. ల్యాండ్రీ బండిపై బట్టలను ఇస్త్రీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు వార్డులోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మల్లారం లక్ష్మి, నాయకులు అవ్వారు సత్యనారాయణ, మల్లారం బాబు, కాపా శ్రీనివాసులు నాయుడు, సుకుమార్, నానీ, హేమంత్, చంటి తదితరులు పాల్గొన్నారు. అలాగే 11వ వార్డు రాణీపేటలో ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ ప్రచారం నిర్వహించారు. ఇల్లిల్లూ తిరుగుతూ అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తూ తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఆమె వెంట నాయకులు కేవీకే ప్రసాద్ నాయుడు, శ్రీరామదాసు గంగాధర్, 3వ వార్డు కౌన్సిలర్ ప్రభావతి, 11వ వార్డు మాజీ కౌన్సిలర్ మల్లికార్జున్, నాయకురాలు గంగరాజు, రాణా విజయ, జనసేన నాయకురాలు రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధంలాంటిది



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్డీవో, డీఎస్పీ, వివిధ శాఖల అధికారులు

గూడూరు, మార్చి 30: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధంలాంటిదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలో వివిధశాఖల ఆధ్వర్యంలో సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్, ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం నుంచి వివిధశాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు ర్యాలీగా టవర్‌క్లాక్ వద్దకు చేరుకుని మానవహారం ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఓటర్లకు అవగాహన కల్పించేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా ఓటర్లను భయాందోళనకు, ప్రలోభాలకు గురిచేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా పటిష్ట చర్యలను చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో సెట్నెల్ అధికారి మురళీకృష్ణారెడ్డి, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, తహసీల్దారు కరుణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంఈవో కాంచన, పట్టణ సీఐ పాపారావు, ఎస్‌ఐ శ్రీహరిబాబు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

రఘునాథరెడ్డి కుటుంబానికి చంద్రబాబు పరామర్శ



చంద్రబాబుతో ప్రభావతమ్మ

నాయుడుపేట, మార్చి 30: ఏఎంసీ మాజీ చైర్మన్, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గూడూరు రఘునాథరెడ్డి ఇటీవల మృతి చెందారు. ప్రజాగళం సభలో పాల్గొనేందుకు నాయుడు పేటకు వచ్చిన చంద్రబాబు గూడూరు రఘునాథరెడ్డి భార్య మాజీ సర్పంచు ప్రభావతమ్మ, కుమారుడు సుధీర్‌రెడ్డిని పరామర్శించారు.

అసలీ ఎమ్మెల్వో ఎవరు?

వలంటీర్లను రాజీనామా చేయమనడంపై విచారణ

వరదయ్యపాళెం, మార్చి 30:రాజీనామా చేసి వైసీపీ తరఫున ప్రచారంలో పాల్గొనండి..పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చాక మిమ్మల్నే విధుల్లోకి తీసుకుంటాం అంటూ వలంటీర్లపై ఒక మండల లెవల్ ఆర్గనైజర్ (ఎమ్మెల్వో) ఒత్తిడి చేయడంపై శనివారం పత్రికల్లో వెలువడిన కథనాలు వరదయ్యపాళెం మండలంలో కలకలం రేపాయి. అసలు ఈ ఎమ్మెల్వో చంద్ర ఎవరనే విషయంపై చర్చ నడిచింది. పత్రికా కథనాలపై ఎంసీసీ(మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అధికారి చిరంజీవి స్పందించి ఆ వలంటీర్లు పనిచేసే సచివాలయ అధికారి బసిరెడ్డికి విచారణ జరపాలని నోటీసు పంపారు.వలంటీర్లను పిలిపించి బసిరెడ్డి వివరణ కోరగా ప్రతి పథకం అమలు చేసే సమయంలో ఎమ్మెల్వో చంద్ర పెట్టే గ్రూప్ మీటింగుల మాదిరిగానే ఈ నెల 28వ తేదీ సాయంత్రం 6గంటల సమయంలో ఫోన్ చేసి డేటా అడగ్గా కొంతమంది స్పందించి వివరాలు చెప్పామన్నారు. ఎప్పుడూ జరిగే కార్యక్రమమే కదా అని స్పందించామంటూ వలంటీర్లు వివరణ ఇచ్చారు. ఈ సమాచారాన్ని ఇన్‌చార్జి ఎంపీడీవో అనసూయకు,ఎంసీసీ అధికారి చిరంజీవికి కార్యదర్శి బసిరెడ్డి తెలిపారు.వారు ఆ నివేదికను తిరుపతి డీఎల్డీవో, జీఎస్ డబ్ల్యూ కార్యాలయ అధికారులకు పంపించారు. అసలు ఈ ఎమ్మెల్వో చంద్ర ఎవరు? ఆయన్ను ఎవరు నియమించారు? ఎక్కడ ఉంటారు? తెలుసుకుని కేసు నమోదు చేయిస్తామని చిరంజీవి, అనసూయ తెలిపారు.

ఆక్రమిత ఇళ్ల స్థలాలను స్వాధీనం చేసుకోండి

సూళ్లూరుపేట, మార్చి 30: ప్రభుత్వం వట్రపాలెంలో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను కొందరు ఆక్రమించుకొన్నారని, వాటిని అధికారులు స్వాధీనం చేసుకోవాలని సీపీఐ నాయకులు ఆనంద్ డిమాండ్ చేశారు. వాటిని స్వాధీనం చేసుకుని పేదలకు ఇవ్వాలని ఇవ్వాలని మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు.

ఎన్‌బీకేఆర్‌లో ఎస్పాటికా సంబరాలు

కోట, మార్చి 30: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం రాత్రి ఎస్పాటికా సంబరాలు జరిగాయి. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతులు జ్యోతిప్రజ్వలన చేసి సంబరాలు ప్రారంభించారు. విద్యార్థులు ఆటపాటలు, డ్యాన్సులతో హోరెత్తించారు. ఉత్తమ నాటికలను ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



ఇద్దరు రుయా ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

తప్పుడు రిపోర్టులు ఇచ్చిన ఫలితం

తిరుపతి (వైద్యం), మార్చి 30: వైద్యం కోసం వచ్చిన రోగికి హెచ్‌ఐవీ అంటూ తప్పుడు రిపోర్టులు ఇచ్చిన ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ రుయాస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభ శనివారం ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదంలో కాలికి గాయమైన ఓ యువకుడు పది రోజుల కిందట వైద్యం కోసం రుయాస్పత్రికి వచ్చాడు. వైద్యుల సూచన మేరకు ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేయించుకోగా హెచ్‌ఐవీ పాజిటివ్ అని తప్పుడు రిపోర్టులు ఇచ్చారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితం కావడంతో రుయా సూపరింటెండెంట్ రవిప్రభ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి తప్పుడు రిపోర్టులు ఇచ్చిన ల్యాబ్ టెక్నీషియన్ బి.రాజశేఖర్ నాయక్, ల్యాబ్ అటెండరు ఎస్.రమణ మోహన్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. విచారణ కొనసాగుతోందని, పూర్తయ్యే వరకు అందుబాటులో ఉండాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ల్యాబ్‌ను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాల్సిన మైక్రోబయాలజీ విభాగాధిపతి, డాక్టర్లను తప్పించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. సాధారణంగా ల్యాబ్ నుంచి వచ్చే ప్రతి రిపోర్టును ల్యాబ్ విభాగాధిపతి లేదా సంబంధిత డాక్టర్లు పరిశీలించిన తర్వాతనే రోగులకు అందించాలి.

టీడీపీకి యువత అండగా నిలవాలి



కరపత్రాలను అందజేస్తున్న పాశం జశ్వంత్‌కుమార్

గూడూరు అర్బన్, మార్చి 30: రానున్న ఎన్నికల్లో యువత టీడీపీకి అండగా నిలవాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తనయుడు డాక్టర్ జశ్వంత్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక కూరగాయల మార్కెట్, వివేకానందా రోడ్డు ప్రాంతాల్లోల శంఖారావం - సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి ప్రజాప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, వెంకటేష్, అల్లీహుస్సేన్, అబ్దుల్‌రహీం, రవీంద్రరెడ్డి, జనార్దన రెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైసీపీ ప్రచార సామగ్రి నిల్వపై ఫిర్యాదు

గోదాముల నిర్వాహకులు నలుగురిపై కేసు

రేణిగుంట, మార్చి 30: వైసీపీ ప్రచార సామగ్రి భారీ ఎత్తున నిల్వ చేసిన మూడు గోదాముల నిర్వాహకులు నలుగురిపై కేసు నమోదయ్యింది.రేణిగుంట మండలం పాత విమా నాశ్రయ రోడ్డులోని మూడు గోదాముల్లో పెద్ద ఎత్తున వైసీపీ ప్రచార, ప్రభావిత సామగ్రి మూడురోజుల క్రితం బయటపడిన విషయం తెలిసిందే.టీడీపీ నాయకుల ఆందోళనతో ప్రచార సామగ్రిని సీజ్ చేసిన అధికారులు శుక్రవారం కలెక్టర్ అనుమతితో తరలించడానికి అనుమతించారు. కాగా వైసీపీ ప్రచార, ప్రభావిత సామాగ్రిని భద్రపరచిన గోదాముల నిర్వాహకులపై రేణిగుంట ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి సలోమి శనివారం గాజులమండ్యం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.దీంతో ప్రచార సామగ్రిని కొనుగోలు చేసిన సుమన్, గోడౌన్‌లో ప్రచార సామగ్రి ఇన్‌చార్జులు అనిల్, రమేష్‌రెడ్డి, గోదాము ఇన్‌చార్జి రవికుమార్‌పై 188వ సెక్షన్ కింద కేసు నమోదు చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సుబ్బారాయుడు తెలిపారు. అలాగే రేణిగుంట అర్బన్ పోలీసు స్టేషన్లో కూడా గోదాముల నిర్వాహకులు సుమన్,ప్రచార సామగ్రి ఇన్‌చార్జులు అనిల్, రమేష్‌రెడ్డిలపై కేసు నమోదు చేశారు.

త్రిపుర వర్సిటీ వీసీగా నరసింహరాజు

ఎస్వీయూ రిటైర్డు ఆచార్యుడికి అత్యున్నత పదవి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 30: త్రిపురలోని ఇంటర్నేషనల్ బుద్ధిస్ట్ యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ ఎంపీ నరసింహరాజు (డాక్టర్ ముద్దలూరు పెద్ద నరసింహరాజు) నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు వెలువరించింది. ఉమ్మడి కడప జిల్లా రైల్వే కోడూరు ప్రాంతానికి చెందిన ఆయన ఎస్వీ యూనివర్సిటీ సోషియాలజీ విభాగంలో సుదీర్ఘ కాలం ప్రొఫెసర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. సోషియాలజీ హెడ్‌గా, బీఓఎస్ చైర్మన్‌గా, ఎస్వీయూ దూరవిద్యా విభాగం డైరెక్టర్‌గా, ఒంగోలు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌గా పనిచేశారు. ఈ క్రమంలో త్రిపురలో గల ఇంటర్నేషనల్ బుద్ధిస్ట్ యూనివర్సిటీ వీసీగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో త్రిపుర యూనివర్సిటీ వీసీగా నరసింహరాజు బాధ్యతలు స్వీకరించారు. పలువురు ఆయన్ను అభినందించారు.